ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5

కర్ణాటక వార్తలు
బుధవారం 23 జూలై 2025

శరవేగంగా సెంట్రల్ జైలు ఆధునికీకరణ పనులు

● రూ.కోటి నిధులతో ఖైదీలకు ప్రత్యేక సౌకర్యాలు
● ప్రహరీ ఎత్తు పెంపు

8


కొనసాగుతున్న ప్రహరీ పనులు

ఇంటి బోరుకూ పన్ను..!



● ప్రైవేట్ బోర్లకూ లెక్క చెప్పాల్సిందే ● కేబినెట్ ఆమోదముద్ర
● వృథా నీటిని అరికట్టడమే లక్ష్యం : ప్రభుత్వం

బెంగళూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఇళ్లు, అపార్ట్‌మెంట్, సొంత స్థలం ఇలా ఎక్కడ బోరు వేసుకున్నా ఇకపై ప్రభుత్వానికి లెక్క కట్టాల్సిందే. భూగర్భజలాలు దుర్వినియోగం కాకుండా అడ్డుకట్ట వేసేందుకు నగర ప్రదేశాల్లో బోరుబావులనుంచి సేకరించే నీటి ప్రమాణాన్ని కొలిచేందుకు డిజిటల్ టెలిమెట్రి మీటర్లను అమర్చనున్నారు. నగర ప్రదేశాలలో విలాసవంతమైన ఇల్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించుకునే ముందే సొంతంగా నీరు సమకూర్చుకునేందుకు బోరుబావులను తవ్వుకుంటున్నారు. రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాలకు జలాశయాలనుంచి పైప్‌లైన్‌లు, ఇతరత్రా మార్గాల ద్వారా శాశ్వతమైన తాగునీటి సౌలభ్యం కల్పించారు. నెలవారీ వారు వాడుకునే నీటినిబట్టి పన్ను విధిస్తారు. ఇలా నగరాలు, పట్టణాలకు శాశ్వతమైన నీటి వనరులున్నా సొంతంగా వేసుకున్న బోర్లనుంచి నీటిని తోడుతున్నారు. నగర పాలికె, మహానగర పాలికెలనుంచి పంపిణీ చేసే నీటికి వాడకాన్ని బట్టి పన్ను ఉంటుంది. కానీ సొంతబోర్లకు ఎటువంటి పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు. కేవలం విద్యుత్ చార్జీలు మాత్రమే ఉంటాయి. సొంత బోరు నీటి వాడకంలో నియంత్రణ లేకుండా పోతోంది. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లకు, వాణిజ్య సముదాయాలలో వాడకానికి నీటిని ఉపయోగిస్తున్నారు. కానీ బెంగళూరు, మైసూరు, హుబ్బళ్ళి, బెళగావి, మంగళూరు వంటి నగరాల్లో సొంతబోర్లు ఏర్పాటు చేసుకుని నీటిని ట్యాంకర్ల ద్వారా విక్రయిస్తున్నారు. కొంతమందికి ఇదే వ్యాపారంగా మారింది. ఇక సొంత బోర్లు ఉండేవారు ప్రతిరోజూ ఇంట ముంగిట శుభ్రం, వాహనాలు కడిగేందుకు ఇష్టారాజ్యంగా నీటిని వినియోగిస్తున్నారు. నీటి సమస్యను కనీసస్థాయిలో కూడా వారు అర్థం చేసుకునే పరిస్థితిలో లేరు. బెంగళూరులో గత ఏడాది వేసవిలో నీటి సమస్య తలెత్తింది. పాతబెంగళూరు ప్రాంతానికి కావేరి జలాలు వస్తున్నా శివారు ప్రాంతాల్లో లక్షలాది అపార్ట్‌మెంట్లలో నివసించేవారికి బోరుబావుల నీరే ప్రధాన వనరుగా ఉంది. బోరుబావుల్లో భూగర్భజలమట్టం తగ్గిపోవడంతో పలు ఆంక్షలు విధించారు. వాహనాలను కడగరాదని, ఇళ్ల ముందు నీటిని వృథా చేయరాదని నిబంధనలు విధించిన సంగతి తెలిసిందే. ఇలా నీటిని వృథా చేయడంపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జలమండలి అభిప్రాయపడుతోంది. సమస్య వచ్చినప్పుడు మాత్రమే నిబంధనలు కాకుండా భూగర్భజలాలను ఇష్టారాజ్యంగా వాడే విధానాన్ని నియంత్రించాలనేది ప్రధాన ఉద్దేశంగా ఉంది.

మార్గదర్శకాలు విడుదల చేసిన కేంద్రం

● భూగర్భజలాల వాడకాన్ని నిర్బంధించేందుకు కేంద్ర భూగర్భజల ప్రాధికార విడుదల చేసిన మార్గదర్శకాలను రాష్ట్రప్రభుత్వం అంగీకరించింది. ఇందుకు సంబంధించి చిన్నతరహా నీటి పారుదలశాఖ సమర్పించిన ప్రస్తావనలకు గతవారం మంత్రిమండలి ఆమోదించింది. ప్రాధికార మార్గదర్శకాలకు సవరణలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధమైంది. నీటి వాడకాన్ని బట్టి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. పరిశ్రమలు, కమర్షియల్, గనుల తవ్వకాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి, అపార్ట్‌మెంట్‌లు, కాలనీలలో భూగర్భజలమట్టాన్ని ప్రతి క్యూబిక్ మీటరుకు రూ.1 నుంచి 35 వరకు పన్ను విధించాలని ప్రభుత్వం ప్రస్తావించింది. కర్ణాటక భూగర్భ జల నిబంధన 2011, 2012 నిబంధనల ప్రకారం నీటి వాడకానికి సంబంధించి అనుమతులు పొందాల్సి ఉంది. రాష్ట్రప్రభుత్వం నియమాలను రూపొందించినా చార్జీ విధించలేదు. మార్గదర్శకాలు పాటించకుండా నిబంధనలు ఉల్లంఘించేవారికి రూ.10వేలు జరిమానా విధించే అవకాశం ఉంది. ప్రస్తుతం కేంద్ర భూగర్భజల ప్రాధికార మార్గదర్శకాల ప్రకారం లక్ష రూపాయలకు పెంచారు. నగర ప్రదేశాల్లో అపార్ట్‌మెంట్‌లు, హౌసింగ్ కార్పొరేషన్‌లు, పబ్లిక్ వాటర్ సప్లయ్ సంస్థలకు రోజుకు 25 క్యూబిక్ మీటర్ల వరకు రూ.1నుంచి 25రూపాయలు, 200 క్యూబిక్ మీటర్లకు పైబడితే రూ.2గా నిర్ధారించారు. ప్రభుత్వ నీటి సరఫరా చేసే సంస్థలకు క్యూబిక్ మీటరుకు 50 పైసలు, వాటర్ ఫ్లో మీటర్లను తప్పనిసరి చేశారు.



మినహాయింపుల జాబితా

● గ్రామీణ, నగర ప్రదేశాల్లో వ్యక్తిగత గృహాలకు భూగర్భజల వాడకం, గ్రామీణ నీటి సరఫరా, నగర, గ్రామీణ ప్రదేశాలలో సైన్యం, కేంద్రీయ మిలిటరీ సంస్థలు, బెటాలియన్లు, ఆర్మ్‌డ్ ఫోర్సెస్, వ్యవసాయ పనులు, చిన్న, సూక్ష్మ పరిశ్రమలకు రోజుకు 10 క్యూబిక్‌లకంటే తక్కువ నీటి వాడకం కల్గినవారికి, గృహావసరాలు, పరిశ్రమలకు మౌలిక సదుపాయాలకు రోజుకు 5 కేఎల్‌డీ (5 వేల లీటర్ల) దాకా మినహాయింపు ఉంది. తాగునీరు, గృహావసరాలకు 20 కేఎల్‌డీ (రోజుకు 20వేల లీటర్లు) ఉపయోగించవచ్చు. అపార్ట్‌మెంట్‌లు, హౌసింగ్ కార్పొరేషన్ల సంఘాలు, ఆర్థికంగా వెనుకబడినవారు, మురికివాడలకు మినహాయింపు ఉంది.

అపార్ట్‌మెంట్లకు తప్పనిసరి

● గ్రేటర్ బెంగళూరు పరిధిలో అపార్ట్‌మెంట్లకు బోరుబావులకు, బెంగళూరు నగర వ్యాప్తంగా సొంత ఇళ్లకు అనుబంధంగా ఉన్న బోరుబావులకు టెలిమిత్రి కల్గిన డిజిటల్ వాటర్ ఫ్లో మీటర్ అమర్చాలి. 20 కేఎల్‌డీల వరకు ధర విధించరు. ఒక కేఎల్‌డీ అంటే రోజుకు వెయ్యి లీటర్లు. కాగా పబ్లిక్ వాటర్ సప్లయ్ చేసే బోరుబావులకు, వ్యవసాయ బోరుబావులకు, వ్యక్తిగత తాగునీటి బోర్లకు ఏ విధంగాను సమస్య కాకుండా పరిశ్రమలు, వాణిజ్య, మౌలిక సదుపాయాల అభివృద్ధికి అనుబంధమైన విభాగాలకు తాగునీటికి, గృహ అవసరాల వినియోగానికి ట్యాంకర్ల ద్వారా నీరు సమకూర్చే అవకాశం కల్పించారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేవారు అత్యధికంగా ఉపయోగించే ప్రదేశాల్లో భూగర్భజల వినియోగాన్ని బట్టి పన్ను. సురక్షితంగా నీటిని వాడే ప్రదేశాలలో క్యూబిక్ మీటరుకు 10 రూపాయలుగా నిర్ణయించి, రోజుకు 150 క్యూబిక్ మీటర్లు సేకరించే వెసలుబాటు ఉంది. సమస్యాత్మక ప్రాంతాల్లో క్యూబిక్ మీటరుకు రూ.20-25 దాకా, రోజుకు 100 క్యూబిక్ మీటర్లు నీటిని తోడవచ్చు. అతిగా వినియోగించే ప్రాంతాల్లో క్యూబిక్ మీటరుకు రూ.35, రోజుకు 50 క్యూబిక్ మీటర్ల దాకా వినియోగించే అవకాశం ఉంది. బోరుబావులకు సంబంధించి అనుమతులకు యూజర్ ఐడీ మార్పు, కంపెనీ పేరు మార్పు, ఎన్‌ఓసీ విస్తరణ, ఎన్‌ఓసీ నకలు కాపీ, ఎన్‌ఓసీ సవరణలకు రూ.5వేలు. రెన్యూవల్‌కు 5వేల రూపాయలు, దరఖాస్తు ఫీజు రూ.10వేలుగా నిర్ణయించారు.

నోరుమూసుకుని పాలన సాగించండి

● నాయకత్వ మార్పుపై మాట్లాడితే చర్యలు
● పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించవద్దు
● రాష్ట్ర నేతలకు ఖర్గే వార్నింగ్



బెంగళూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): నాయకత్వ మార్పు అంశంపై పదే పదే చర్చలు సాగుతున్న తరుణంలో రాష్ట్ర నేతలను ఖర్గే తీవ్రంగా హెచ్చరించినట్లు తెలుస్తోంది. రాష్ట్ర పార్టీలో వర్గపోరు ఇటు రాష్ట్ర, అటు అధిష్టానం పెద్దలకు ఈ అంశం తలనొప్పిగా మారింది. గతవారం ఢిల్లీ వెళ్లిన సీఎం సిద్దరామయ్య ఐదేళ్లు తానే ముఖ్యమంత్రిని అంటూ... బహిరంగ ప్రకటన చేశారు. తాజాగా సోమవారం డీసీఎం డీకే శివకుమార్ సొంత నియోజకవర్గం కనకపురలో పర్యటించిన వేళ తన సేవలు రాష్ట్రానికి వద్దా...? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్ర కాంగ్రెస్‌లో గ్రూపుల వివాదం ఉందనేది తెలిసిందే. ఢిల్లీలో సీఎం వ్యాఖ్యలను అధిష్టానానికి చెందిన నేతలు ఎవరూ ఖండించకపోవడం, డీసీఎం డీకే శివకుమార్ వర్గీయులకు తీవ్ర అసంతృప్తి చోటు చేసుకుంది. ఈ వివాదాన్ని తీవ్రంగా పరిగణించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ నోరు మూసుకుని పాలన సాగించాలని వార్నింగ్ ఇచ్చారు. రాష్ట్రంలో పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తే సహించేది లేదన్నారు. శాసనసభ ఎన్నికల్లో ఐదు గ్యారెంటీలను ప్రజలు విశ్వసించారన్నారు. ప్రతిసారి రోడ్డున పడేలాంటి వ్యాఖ్యలు చేసుకోవడం సరికాదన్నారు. నాయకత్వ మార్పు గురించి ఎవరూ మాట్లాడరాదని, అధిష్టానానికి అన్నీ తెలుసని హెచ్చరించారు. గతవారం మైసూరులో సాధనా సమావేశంలో పాల్గొన్న ఖర్గే, సీఎం, డీసీఎంలకు వివాదాలకు పోరాదని సున్నితంగా మందలించినట్లు తెలుస్తోంది. ఖర్గే హెచ్చరించినా రాష్ట్రంలో నాయకత్వ మార్పు అనే అంశం సమసిపోయేదిగా అనిపించడం లేదు. ఇటీవల నెలరోజులలో సీఎం రెండుసార్లు, డీసీఎం నాలుగైదుసార్లు ఢిల్లీ వెళ్లి వచ్చారు. వారిద్దరూ ఈనెల 25న మరోసారి ఢిల్లీ వెళ్లడమే కుతూహలం అనిపిస్తోంది. రెండుసార్లు ఢిల్లీ వెళ్లిన సీఎం సిద్దరామయ్య అగ్రనేత రాహుల్‌గాంధీని భేటీ కాలేదు. 25న ఢిల్లీ వెళ్తే ఒకటిరెండు రోజులు గడిపే అవకాశం ఉంది. ఆగస్టు 2న ఏఐసీసీ న్యాయ, మానవహక్కుల విభాగం సభలో పాల్గొనేందుకు సీఎం వెళ్లనున్నారు. మరోవైపు 23న పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ సుర్జేవాలా బెంగళూరు రావాల్సి ఉన్నా పార్లమెంటు సమావేశాలు ఉన్న మేరకు హాజరు కావడం లేదు. 25న ఢిల్లీలోనే సీఎం, డీసీఎంలను కలిసే అవకాశం ఉంది. నాయకత్వమార్పు విషయంలో సీఎం వ్యాఖ్యలకు అధిష్టానం ఏ విధంగా సర్దుబాటు చేయనుందో లేదా మరెటువంటి నిర్ణయం తీసుకుంటుందనేది వేచి చూడాల్సి ఉంది.


మాట్లాడుతున్న వ్యాపారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాప్‌శెట్టి

వ్యాపారులకు జీఎస్టీ నోటీసులపై పోరాటమే

● ఖాతాల్లో ఉండేవన్నీ లాభాలు కావు
● రేపు ఫ్రీడం పార్క్‌లో భారీ నిరసన
● చిన్న వ్యాపారుల సంఘం హెచ్చరిక

బెంగళూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 14,000 మందిచిన్న వ్యాపారులకు జీఎస్టీ నోటీసులు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ పోరాటం చేస్తామని బేకరీ, కాండిమెంట్స్, చిన్న వ్యాపారుల సంఘం సభ్యులు తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాప్‌శెట్టి మాట్లాడుతూ కాండిమెంట్స్, బేకరీ, పాలు, కూరగాయల వ్యాపారులకూ నోటీసులు ఇచ్చారన్నారు. దీంతో వ్యాపారుల్లో భయం పట్టుకుందన్నారు. నాలుగేళ్ల బ్యాంకు లావాదేవీలకు అనుగుణంగా నోటీసులు వచ్చాయన్నారు. వ్యాపార లావాదేవీలంతా లాభం కాదన్నారు. బ్యాంకు ఖాతాల్లో కొనసాగిన సొమ్మునంతా లాభాలుగా చూడడం సరికాదన్నారు. అధిక వడ్డీలకు రుణాలు తీసుకుని వ్యాపారాలు చేస్తున్నామన్నారు. చిన్నవ్యాపారులు ఇప్పుడే పలు వేధింపులకు గురవుతున్నారని, ప్రోత్సాహం అందించాల్సిన ప్రభుత్వం ఇలా వేధించడం తగదన్నారు. ఎందరికో ఉపాధి కల్పిస్తూ వ్యాపారులు జీవనం సాగిస్తున్నా రన్నారు. ప్రతి దుకాణంలోనూ ఒకరిద్దరు కార్మికులు ఉంటారన్నారు. ఇటీవల చిన్న వ్యాపారుల వద్ద అప్పులు ఎగవేసేవారు పెరిగారన్నారు. ఎంతోకొంత లాభం ద్వారా కుటుంబాన్ని పోషించుకోవచ్చుననే వ్యాపారాలు చేస్తున్నారన్నారు. నిరంతరంగా నిలబడి ఉండడం ద్వారా పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఇటీవల డిజిటల్ పేమెంట్‌లు పెరిగాయన్నారు. చిల్లర కొరత తీవ్రంగా వేధిస్తోందన్నారు. అయినంత మాత్రాన అంతా అన్నీ లాభాలు కావన్నారు. ఈనెల 24న ఫ్రీడంపార్కులో భారీ నిరసన చేపడ్తామన్నారు. బేకరీ, కాండిమెంట్స్ వ్యాపారుల సమాఖ్యకు చెందిన కరుణాకరశెట్టి, కేశవపూజారి, వసంత్‌శెట్టి, వసంత్‌పై, గీతా, అభిలాష్‌శెట్టి, ఉమేశ్ కొఠారి ఉన్నారు.

బ్రెస్ట్‌మిల్క్..!

● ఆసుపత్రిలో అందుబాటులో అమ్మపాలు ● రాష్ట్రంలో తొలిసారి తల్లిపాల బ్యాంకు
● బళ్లారి మెడికల్ రీసెర్చ్ సెంటర్‌లో ఏర్పాటు ● ప్రారంభానికి సిద్ధమైన ప్రత్యేక విభాగం

బళ్లారి గాంధీనగర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తం అవసరం అయిన సమయంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో బ్లడ్‌బ్యాంకులు ఏర్పాటు చేయడం, రక్తదాన కార్యక్రమాలు నిర్వహిం చడం పరిపాటి. అయితే... గర్భిణిలు తొమ్మిది నెలలు నిండకనే బిడ్డలను కనడం, ఏదైనా దురదృష్టకర పరిస్థితుల్లో అమ్మకు దూరమైన శిశువులకు ఆకలి తీర్చడానికి అమ్మ పాల బ్యాంకును ఏర్పాటు చేయనున్నారు. శిశువులు తల్లిపాల కొరతతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని గుర్తించిన రాష్ట్ర ఆరోగ్య శాఖ 'అమృత ధార' పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఇందులో భాగంగానే బళ్ళారి నగరంలో బళ్లారి మెడికల్, రీసెర్చ్ సెంటర్ కేంద్రంలో తల్లిపాల బ్యాంకును ఏర్పాటు చేయనుంది అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. బళ్లారి బిమ్స్‌లో రోజూ 25 నుంచి 30 ప్రసవాలు జరుగుతుంటాయి, ఇక్కడ తల్లలు, పిల్లలకు ప్రత్యేక వైద్య సదుపాయం ఉంది. సాధారణ బరువు కంటే తక్కువ, తొమ్మిది నెలలు నిండకనే జన్మించే శిశువులు అనారోగ్యంతో విలవిలలాడం ఇక్కడ సర్వసాధారణమైంది. వీరి సౌకర్యార్థం తల్లి పాల బ్యాంకును ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం సిటీ కార్పొరేషన్ నుంచి రూ 25లక్షలు, జిల్లా పాలనా మండలి ఆధ్వర్యంలో రూ.50లక్షలు మొత్తం రూ రూ.75లక్షల ఖర్చుతో మదర్ మిల్క్‌బ్యాంకు ఏర్పాటు చేయనుంది. ప్రస్తుతం మిల్క్‌బ్యాంకు ఏర్పాటు తుది దశలో ఉంది. బ్యాంకులో మొత్తం 510 బాటిళ్ళ మదర్ మిల్క్ సంగ్రహించే సామర్థ్యం ఉన్నట్లు అధికారులు తెలిపారు. కళ్యాణ కర్నాటక పరిధిలో ఎక్కువగా అపౌష్టికత, అవధి నిండకనే జననాలు, తక్కువ బరువుతో జన్మించడం లాంటి అనారోగ్య సమస్యలతో శిశువులు జన్మించడం లాంటి కారణాల చేత ఈ భాగంలో అపౌష్టికత తీవ్రంగా చిన్నారులను వెంటాడుతుంది. రాష్ట్రంలో వేళ్ళలో లెక్కపెట్టే మదర్ మిల్క్‌బ్యాంకులు ప్రారంభించినా అవి సామాన్య ప్రజలకు అందుబాటులో లేవు. విధిలేని స్థితిలో బాలింత మహిళలు ఆవుపాలు, గంజిలాంటి వాటిని శిశువులకు ఇస్తూ కాపాడుకునే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఇలాంటి మదర్ మిల్క్ కేంద్రాలు ఏర్పాటు చేస్తుండడం హర్షించదగ్గ విషయం. పాలిచ్చే తల్లులు తమకు ఎక్కువైన పాలను దానం చేయడం ద్వారా ఎందరో శిశువులకు ప్రాణం పోసినట్లు అవుతుందని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న బ్యాంకుల్లో స్వచ్ఛందంగా తల్లులు వచ్చి పాలను దానం చేయవచ్చని డాక్టరు కోరుతున్నారు. ఈ విషయంపై ప్రజల్లో అవగాహన వచ్చే దిశలో అధికారులు జాగృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



తల్లిపాలను సేకరించేందుకు ప్రత్యేక కేంద్రం


అధునాతనమైన ఫ్రిడ్జ్


తల్లిపాల భద్రతకు ఏర్పాటు చేసిన ప్రత్యేక యంత్రం

దర్శన్ కేసు రేపటికి వాయిదా



బెంగళూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్యకేసులో నిందితుడిగా ఉన్న నటుడు దర్శన్‌తోపాటు ఇతరులకు బెయిల్ మంజూరును ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టులో పోలీసులు దాఖలు చేసిన కేసు ఈ నెల 24 గురువారానికి వాయిదా పడింది. మంగళవారం సుప్రీంకోర్టులో దర్శన్ తరఫున న్యాయవాది సిద్ధార్థ దవే వాదనలు వినిపించారు. వాస్తవానికి దర్శన్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదిస్తున్నారు. మరో కేసు కారణంగా ఒకరోజు గడువు కావాలని న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌ల ద్విసభ్య ధర్మాసనాన్ని కోరారు. 15నిమిషాలు వాదనలకు అవకాశం కల్పిస్తామని, మిగిలిన అంశాలను రికార్డుల రూపంలో సమర్పించాలని ఆదేశించిన ధర్మాసనం గురువారానికి వాయిదా వేసింది. నటుడు దర్శన్‌తోపాటు ఈ కేసులో అందరికీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. హైకోర్టు తీర్పును ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టును పోలీసులు ఆశ్రయించారు. ఇదే విషయమై గతవారం విచారణ వేళ వీరికి బెయిల్ మంజూరు చేయడం సమంజసమా..? ధర్మాసనం ప్రశ్నించింది. దీంతో దర్శన్, ఇతరులకు మరోసారి సమస్య తప్పదనే అభిప్రాయాలు ఉన్నాయి. దర్శన్ సినిమా షూటింగ్ నిమిత్తం థాయ్‌ల్యాండ్ వెళ్లారు.

ఉత్సాహంగా ఈ-ఖాతా మేళా

హెబ్బాళ్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆస్తులకు సంబంధించిన పత్రాలు కలిగి ఉండడంతోపాటు, వాటిని తప్పనిసరిగా ఆన్‌లైన్‌లోనూ నమోదు చేసుకునే డిజిటలైజేషన్ ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఇందులో భాగంగా ఈ-ఖాతా చేసుకునేందుకు నగర వ్యాప్తంగా శిబిరాలు చేపట్టారు. ఆర్‌టీనగర్ హెచ్ఎంటీ మైదానంలో ఏర్పాటైన ఈ-ఖాతా మేళాను మంత్రి బైరతి సురేశ్‌ను మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆధునిక సేవలతో రెవెన్యూ సేవలు మరింత సరళీకృతం చేస్తున్నామన్నారు. స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొని ఈ-ఖాతా సేవల్లో నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ఆనంద్, తూర్పు డివిజన్ కమిషనర్ స్నేహల్ ఆర్, జాయింట్ కమిషనర్ సరోజ, డిప్యూటి కమిషనర్ రాజు, రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.


మేళాను ప్రారంభిస్తున్న మంత్రి బైరతి సురేశ్

రైళ్ల వేళల మార్పు



గుంతకల్లు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా మీదుగా వెళ్లే పలు రైళ్ల సమయాలను సవరించినట్లు మంగళవారం రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-గ్వాలియర్ ఎక్స్‌ప్రెస్ (11085) సెప్టెంబరు 22 నుంచి ఐదు నిమిషాలు ఆలస్యంగా అనంతపురానికి రాత్రి 8-23 గంటలకు వస్తుందన్నారు. ధర్మవరం-నరసాపూర్ ఎక్స్‌ప్రెస్ (17248) తిరుపతికి సెప్టెంబరు 17 నుంచి 25 నిమిషాలు ముందుగా సాయంత్రం 6-20 గంటలకే చేరుకుంటుందన్నారు. ముంబై-చెన్నై ఎక్స్‌ప్రెస్ (22159) గుంతకల్లుకు జూలై 25 నుంచి అరగంట ఆలస్యంగా ఉదయం 3 గంటలకు చేరుకుంటుందన్నారు. హుబ్లీ-చెన్నై ఎక్స్‌ప్రెస్ (17313) ఈనెల 25 నుంచి గుంతకల్లుకు ఐదు నిమిషాలు ఆలస్యంగా ఉదయం 3-05 గంటలకు చేరుతుందన్నారు. ఏక్తానగర్-చెన్నై ఎక్స్‌ప్రెస్ (20920) ఈ నెల 30 నుంచి 15 నిమిషాల ఆలస్యంగా ఉదయం 6-55 గంటలకు చేరుకుంటుందన్నారు. అహ్మదాబాద్-చెన్నై ఎక్స్‌ప్రెస్ (22920) ఈ నెల 28 నుంచి గుంతకల్లుకు 15 నిమిషాల ఆలస్యంగా ఉదయం 6-55 గంటలకు చేరుతుందన్నారు. ముంబై-చెన్నై ఎక్స్‌ప్రెస్ (12163) ఈ నెల 25 నుంచి గుంతకల్లుకు 20 నిమిషాల ఆలస్యంగా ఉదయం 8 గంటలకు చేరుతుందని తెలియజేశారు. పూనా-కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ (16381) ఈ నెల 25 నుంచి గుంతకల్లుకు 20 నిమిషాలు ఆలస్యంగా ఉదయం 9-50 గంటలకు చేరుకుంటుందని వెల్లడించారు.

ప్రాణాలు తీసిన భోజనం

● ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి ● మరో ముగ్గురి పరిస్థితి విషమం ● రాయచూరు జిల్లాలో విషాదం


దీప, నాగమ్మ రమేశ్ నాయక్ (ఫైల్)

ఆహారం విషతుల్యమై ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందారు. మరో ముగ్గురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రాయచూరు జిల్లా సిరవార తాలూకా కడోణి తిమ్మాపుర గ్రామంలో మంగళవారం ఈ విషాద సంఘటన చోటు చేసుకుంది.

(వివరాలు మెయిన్‌లో)

15 కుటుంబాలు ఘర్ వాపసి

బెంగళూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): చిక్కబళ్లాపుర జిల్లా గౌరిబిదనూరు తాలూకా విదురాశ్వత్థలో క్రైస్తవమతంలోకి చేరిన 15 కుటుంబాలు ఘర్ వాపసిలో భాగంగా తిరిగి హిందూమతంలోకి వచ్చా రు. నాగసంద్ర, గాంధీనగర, కదిరేనహళ్ళి, మధుగిరి తాలూకా కొడిగేనహళ్ళిలోని పలు కుటుంబాలు హిందూ నుంచి క్రిస్టియన్ మతంలోకి వెళ్లాయి. అయితే వారంతా మతం మార్చుకోవాలని, పూర్వీకుల సంప్రదాయం పాటించాలని భావించారు. సోమవారం విదురాశ్వత్థ అశ్వత్థనారాయణస్వామి ఆలయంలో హిందూమతంలోకి చేరే విధానాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. స్థానికులు రవినారాయణరెడ్డి మాట్లాడుతూ కొన్ని కారణాలతో క్రైస్తవమతంలోకి వెళ్లిన వారు పశ్చాత్తాపం చెంది వెనుతిరిగి వచ్చారన్నారు.


హోమంలో పాల్గొన్న కుటుంబ సభ్యులు

శ్రావణంలో అంజన్న దర్శనం శ్రేష్ఠం

- 25 నుంచి నేమకల్లులో ఉత్సవాలు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



నేమకల్లు గాలి గోపురం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు



నేమకల్లు ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్, జూలై 22(ఆంధ్రజ్యోతి): సకల శుభాల శ్రావణ మాసం ఈ నెల 25న ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా నేమకల్లులో వెలసిన ప్రముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రావణ ఉత్సవాలు నిర్వహించేందుకు దేవదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మాసంలో ప్రతి శని, మంగళవారాల్లో ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు వచ్చి స్వామిని దర్శించుకుంటారు. కసాపురం, నేమకల్లు, మురిడి ఆంజనేయస్వామిని శ్రావణంలో శనివారం, మంగళవారం ఏదో ఒకరోజు దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని, ఆ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా కోసం ఎస్ఐ నబీ రసూల్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. శ్రావణ మాసంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు అనిల్‌కుమార్‌చార్యులు తెలిపారు. ప్రతి శని, మంగళవారాల్లో సాయంత్రం పల్లకి సేవ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ మాసంలో స్వామిని దర్శించుకోవడం ఎంతో పుణ్యప్రదమని అన్నారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో నరసింహారెడ్డి తెలిపారు. తాగునీరు, స్నానాలకు నీటిసౌకర్యం, మరుగుదొడ్లు ఏర్పాటు చేశామని ఈవో చెప్పారు.

పర్యాటక కేంద్రంగా పెనుకొండ

ఏపీ టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్



గగన్‌మహల్‌ను చూసి వస్తున్న అజయ్‌జైన్, కలెక్టర్ చేతన్

పెనుకొండ/లేపాక్షి, జూలై 22(ఆంధ్రజ్యోతి): విజయనగర సామ్రాజ్యం రెండో రాజధానిగా వెలుగొందిన పెనుకొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడతామని ఆంధ్రప్రదేశ్ టూరిజం కల్చర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్ పేర్కొన్నారు. పెనుకొండలోని శ్రీకృష్ణ దేవరాయల వేసవి విడిదిగా పేరుగాంచిన గగన్‌మహల్ రాజసౌధాన్ని జిల్లా కలెక్టర్ చేతన్‌తో కలిసి మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. పెనుకొండకు వచ్చిన వీరికి ఆర్డీఓ ఆనంద్‌కుమార్, తహసీల్దార్ స్వాతి, ఇతరశాఖల అధికారులు పుష్ప గుచ్ఛాన్ని అందించి ఘనస్వాగతం పలికారు. చరిత్రకారుడు మైనా స్వామి, పురావస్తుశాఖ అధికారి స్వామినాయక్ పెనుకొండ చరిత్ర విశే షాలు, ప్రాచీన కట్టడాల విశేషాల గురించి అజయ్‌జైన్‌కు వివరించారు. గగన్‌మహల్‌ను డెస్టినేషన్ వెడ్డింగ్ ప్లేస్ (వివాహవేడుకల వేదిక)గా మార్చాలని కోరారు. అనంతరం వారు లేపాక్షికి బయల్దేరి వెళ్లారు.

శిల్పకళ అద్భుతం

లేపాక్షి దుర్గా వీరభద్రస్వాముల ఆలయంలో శిల్ప, చిత్రకళలు అద్భుతంగా ఉన్నాయని ఏపీ టూరిజం కల్చర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్ అన్నారు. జిల్లా కలెక్టర్ చేతన్‌తో కలిసి మంగళవారం ఆయన ఆలయానికి విచ్చేశారు. ఆలయ గైడ్ విరూపణ్ణ ఆలయ చరిత్రను వివరించారు. ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్ధాంతరంగా ఆగిన కల్యాణమండపం, సీతాదేవి పాదం, వేలాడే స్తంభాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయంలో శిల్పాలు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. దుర్గా, వీరభద్రస్వాములకు అర్చనలు నిర్వహించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వీరి వెంట తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ, టూరిజం మేనేజర్ ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

కొత్త రేషన్‌కార్డులు ఎప్పుడో..?

దర్మవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్త రేషన్ కార్డుల మంజూరుకు అవకాశం ఇవ్వడంతో భారీగా దరఖాస్తు చేసుకున్నారు. వైసీపీ హయాంలో కొత్తకార్డుల జారీ లేకపోవడంతో వేలాది మంది పేదలు ఇబ్బంది పడ్డారు. రకరకాల కారణాలతో ఉన్న కార్డులను సైతం భారీగా ఏరివేశారు. ప్రస్తుత ప్రభుత్వం కార్డుల జారీకి నిర్ణయించడంతో ఇప్పటి వరకు 56,291 మంది దరఖాస్తు చేసుకున్నారు. కుటుంబంలో అదనపు సభ్యుల పేర్లు చేర్చాలంటూ 37,542 మంది వినతులు ఇచ్చారు. వైసీపీ పాలనలో రకరకాల నిబంధనల పేరుతో రేషన్‌కార్డులను భారీగా రద్దుచేశారు. ప్రభుత్వం మారిన తరవాత సీఎం చంద్రబాబు కార్డుదారుల కష్టాలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దీంతో మే 14 నుంచి జిల్లా వ్యాప్తంగా సచివాలయాల పరిధిలో రేషన్‌కార్డులకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కొత్తగా వివాహమైన వారు, ఇప్పటి వరకు రేషన్‌కార్డు లేనివారు, ఇప్పటికే ఉన్న కార్డుల్లో మార్పులు, చేర్పులు, ఆధార్ తప్పుగా నమోదైన వారు.. ఇలా ఏడు రకాల సేవలకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. జిల్లాలో కొత్త కార్డుల కోసం 56,291, మార్పులు, చేర్పుల కోసం 37,542 దరఖాస్తులు వచ్చాయి. కొత్త కార్డులు మంజూరు కాకపోవడంతో దరఖాస్తు దారులు ఎప్పుడు వస్తాయోనని నిరీక్షిస్తున్నారు.

ఇక డిజిటల్ కార్డులు

ప్రస్తుతం రేషన్‌కార్డుల్లోనూ మార్పులు చేయనున్నారు. త్వరలో ఇవ్వనున్న కొత్త రేషన్‌కార్డులను రైస్ కార్డుల పేరిట ప్రభుత్వం పంపిణీ చేయనుంది. వీటిని పూర్తిగా ఏటీఎం కార్డు తరహాలో డిజైన్ చేశారు. వీటికి క్యూఆర్ కోడ్ కూడా ఉంటుంది. రేషన్ దుకాణంలో సరుకులు తీసుకున్న తరువాత డీలర్ సేవలపై క్యూఆర్ కోడ్ ద్వారా ప్రభుత్వానికి కార్డుదారులు తమ అభిప్రాయాలను కూడా తెలపవచ్చు.

ఆదేశాలు రాగానే కొత్త కార్డులు



కొత్త రేషన్‌కార్డుల కోసం జిల్లాలో వేలాది మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీటిని పరిశీలించి జాబితాను తయారుచేసి పంపాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కొత్త రేషన్‌కార్డులను అందజేస్తాం. ఏటీఎంలాగా ఉన్న కార్డులను లబ్ధిదారులకు ఇస్తాం.

- వంశీకృష్ణారెడ్డి, డీఎస్ఓ

మూడేళ్లుగా ఎదురుచూస్తున్నా



నాకు వివాహమై ఆరేళ్లవుతోంది. ప్రభుత్వ పథకాలు పొందాలంటే రేషన్‌కార్డు అడుగుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో మూడేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. దీంతో ప్రభుత్వ పథకాలు కోల్పోతున్నా. నా కుమార్తె ఒకటో తరగతి చదువుతోంది. ప్రభుత్వ పథకాలు రావాలంటే బియ్యంకార్డు అవసరం. జ

- రఘు, బసవన్నకట్ట వీధి, కొత్తచెరువు

ఘనంగా షంషీర్

వేకువజామున ఊరేగింపు

మస్తాన్‌వలి ఉరుసుకు పోటెత్తిన భక్తులు



స్వామికి సమర్పించిన షంషీర్



స్వామికి చక్కెర చదివిస్తున్న భక్తులు

గుంతకల్లుటౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతగుంతకల్లులో వెలసిన హజరత్ సయ్యద్ మస్తాన్ వలి 390వ ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం మస్తాన్ వలి షంషీర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. షంషీర్‌ను తిలకించడానికి భక్తులు పోటెత్తారు. దర్గా నుంచి ఊరువాకిలి వరకు భక్తులతో కిక్కిరిసింది. పాతగుంతకల్లులోని ఊరువాకిలిలో నివాసముంటున్న రెడ్డి కులస్థుల ఇంటి నుంచి వేకువజామున స్వామి షంషీర్ ఊరేగింపును ప్రారంభించారు. మేళతాళాలు, యువకుల కేరింతల నడుమ, దివిటీల మధ్య షంషీర్‌ను ఊరేగింపుగా దర్గాకు తీసుకువచ్చారు. పాతగుంతకల్లులోని శివాలయం వద్ద ఉన్న బావిలో నుంచి భక్తులు బిందెలతో నీటిని తీసుకుని అశ్వం పాదాలకు పోసి మొక్కులు తీర్చుకున్నారు. షంషీర్‌ను స్వామికి సమర్పించి, ముజావర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులు ఎండు కొబ్బరిని దివిటీలలో కాల్చి ప్రసాదంగా తీసుకెళ్లారు. స్వామికి చాదర్, పూల హారాలు, చక్కెర సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. డీఎస్పీ శ్రీనివాస్, సీఐ ఏపీ మస్తాన్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ రహీంహుసేన్ తదితరులు పాల్గొన్నారు.

చాదర్ సమర్పించిన ఎమ్మెల్యే

పాతగుంతకల్లులోని హజరత్ సయ్యద్ మస్తాన్ వలి దర్గాలో ఉరుసు ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం స్వామికి చాదర్ సమర్పించారు. దర్గాలో ఎమ్మెల్యేకు టీడీపీ మైనార్టీ నాయకులు స్వాగతం పలికారు. ముజావర్లు ఫాతేహాలు చదివి ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వా మి, బండారు రామన్న చౌదరి, ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, మస్తాన్, పజులు, ఖాజా, సలీం, షంషుద్దీన్ పాల్గొన్నారు.

స్వాగతం కృష్ణమ్మా..!

జలహారతి ఇచ్చిన ఎమ్మెల్యే గుమ్మనూరు

- 3,850 క్యూసెక్కుల ప్రవాహమే టార్గెట్
- ఈ ఏడాది 40 టీఎంసీలు దాటే అవకాశం



హంద్రీనీవాలో కసాపురం వద్దకు చేరిన కృష్ణానీరు

గుంతకల్లు, జూలై 22(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవాలో ఎత్తిపోతలు మొదలయ్యాక ఐదు రోజులకు.. మంగళవారం ఉదయం కృష్ణా జలాలు జిల్లాకు చేరాయి. మల్యాల పంప్‌హౌస్ వద్ద ఈ నెల 17న సీఎం చంద్రబాబు ఎత్తిపోతలను ప్రారంభించారు. కాలువ విస్తరణ పనులు పూర్తయ్యాక తొలిసారి నీరు పారుతోంది. ఈ కారణంగా తక్కువ మోతాదులో నీటిని ఎత్తిపోస్తున్నారు. కర్నూలు జిల్లా మద్దికెరను దాటుకుని బుగ్గసంగాల వద్ద కృష్ణా జలాలు జిల్లాలోకి ప్రవేశించాయి. త్వరలో మరిన్ని పంపుల ద్వారా నీటిని ఎత్తిపోసి, లక్ష్యాన్ని సాధించాలని జల వనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులు కృత నిశ్చయంతో ఉన్నారు.

3,850 క్యూసెక్కులే టార్గెట్

హంద్రీనీవా కాలువ సామర్థ్యానికి అనుగుణంగా మొదటి పంప్ హౌస్ వద్ద గరిష్ఠంగా 3,850 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయాలని ఈ ఏడాది లక్ష్యంగా పెట్టుకున్నారు. తొలి దశలో మల్యాల పంప్‌హౌస్ వద్ద ప్రస్తుతం 4 పంపులను రన్ చేస్తున్నారు. జిల్లాకు సమీపంలో, కర్నూలు జిల్లాలో ఉన్న గుండ్లకొండ 7వ నంబరు పంప్‌హౌస్‌లో 2 పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. దీంతో జిల్లాలోకి ప్రస్తుతం 320 క్యూసెక్కుల నీరు ప్రవేశించింది. రాగులపాడు వద్ద 8వ పంప్ హౌస్‌కు మంగళవారం అర్ధరాత్రికి నీరు చేరుకుంటుంది. అక్కడి నుంచి జీడిపల్లి రిజర్వాయరు వైపు నీటిని ఎత్తిపోస్తారు. కాలువ గట్ల పరిస్థితిని అంచనా వేయడానికి తక్కువ మోతాదులో నీటిని పారిస్తున్నారు. విడతలవారీగా పంపుల సంఖ్యను పెంచుతూపోతారు. పదిహేను రోజుల్లోగా జీడిపల్లి వద్ద అన్ని పంపులనూ రన్‌చేసి, లక్ష్యానికి అనుగుణంగా 3,850 క్యూసెక్కుల నీటిని కాలువలో పారిస్తామని హంద్రీనీవా గుంతకల్లు ఏరియా కార్యనిర్వాహక ఇంజనీరు శ్రీనివాస నాయక్ తెలిపారు.

40 టీఎంసీలు దాటేలా..

హంద్రీనీవాలో 40 టీఎంసీల వరద నీటిని ఎత్తిపోయాలన్న లక్ష్యంతో కాలువను డిజైన్ చేశారు. ఎత్తిపోతలు ప్రారంభమయ్యాక మ్యాజిక్ ఫిగర్ 40 టీఎంసీలు టీడీపీ హయాంలో ఒకసారి, 2020-21 సీజన్‌లో ఒకసారి సాధ్యమైంది. వైసీపీ హయాం లో మిగతా నాలుగు సీజన్‌లలో సాగునీటి పారుదల అత్యంత దయనీయంగా జరిగింది. ప్రస్తుతం హంద్రీనీవా వైడెనింగ్ పూర్తయినందున ఈ సంవత్సరం 40 టీఎంసీలకు మించి సాగునీటిని కాలువలో పారించాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఉంది. ఈ సంవత్సరం అత్యధిక రోజులపాటు కాలువలో నీటిని పారిస్తే.. 40 టీఎంసీల కంటే అధికంగా ఎత్తిపోతలు సాధ్యపడతాయని జలవనరుల అధికారులు తెలిపారు.

ఎత్తిపోతల్లో రికార్డు

హంద్రీనీవాకు సాగునీటి ఎత్తిపోతలు ప్రారంభించే అంశంలో ఈ సంవత్సరం ఓ రికార్డు నమోదైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది జూలై 17కే ఎత్తిపోతలను ప్రారంభించారు. 2020-21 సీజన్‌లో జూలై 24న ఎత్తిపోతలు మొదలయ్యాయి. ఆ సీజన్‌లో గరిష్ఠంగా 266 రోజులపాటు హంద్రీనీవాలో నీరు పారింది. సుమారు 40 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. 2021-22 సీజన్‌లో జూలై 27వ తేదీ నుంచి 201 రోజులు, 2022-23 సీజన్‌లో జూలై 24వ తేదీ నుంచి 237 రోజులు, 2023-24లో ఆగస్టు 21వ తేదీ నుంచి 207 రోజులు, 2024-25 సీజన్‌లో ఆగస్టు 13వ తేదీ నుంచి 212 రోజులపాటు నీరు లభించింది. ఈ సంవత్సరం ఇంకాస్త ముందే పంపింగ్ ప్రారంభించాల్సి ఉన్నింది. శ్రీశైలం డ్యాంలో ఈ నెల తొలి వారంలోనే ఎత్తిపోతలకు తగినన్ని నీటి నిల్వలు ఉన్నా, హంద్రీనీవా విస్తరణ పనుల కోసం ఎత్తిపోతలను చేపట్టలేకపోయారు.

మేమింతే.. అనుకున్నది చేస్తాం..!

- కమిషనర్ వద్దంటున్నా అక్రమ డెప్యుటేషన్లు
- ఎస్ఎస్ఏకు నలుగురు టీచర్లు
- డీపీసీ, ఏపీసీ నిర్ణయాలపై టీచర్ల విస్మయం



Proceedings of the DEO & Ex-Officio Project Coordinator, APSS, Ananthapuramu

నలుగురిని ఎస్ఎస్ఏకు డెప్యుటేషన్ వేస్తూ డీఈఓ ఇచ్చిన ఉత్తర్వులు

అనంతపురం విద్య, జూలై 22(ఆంధ్రజ్యోతి): 'ఎవరో చెబితే వినాలా.. ఎవరికీ భయపడేదిలేదు.. మేమింతే, అనుకున్నది చేస్తాం' అనే భావనతో జిల్లా సమగ్రశిక్ష శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారు. ఇందుకు వారిచ్చిన డెప్యుటేషన్ల ఉత్తర్వులే నిదర్శనంగా నిలుస్తున్నాయి. జిల్లా సమగ్రశిక్షలో దాదాపు ఏడాదిగా కీలకమైన సెక్టోరల్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాఠశాలలకు కోట్లు నిధులు ఇస్తున్నారు. విద్యా పథకాల పర్యవేక్షణ పడకేసింది. విద్యాప్రమాణాలు దెబ్బతింటున్నాయి. అలాంటపుడు సెక్టోరల్స్ పోస్టుల భర్తీకి ఎస్ఎస్ఏ అధికారులు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. గతంలో ఒకసారి నోటిఫికేషన్ ఇచ్చి వివాదం రావడంతో ఇద్దరిని మాత్రమే తీసుకున్నారు. ఇంకా ఆరు పోస్టులు అలాగే ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీకి మళ్లీ గత నెలలో నోటిఫికేషన్ ఇచ్చారు. ఆరు పోస్టులకు 171 దరఖాస్తులు వచ్చాయి. 20 రోజులు దాటినా ఆ దరఖాస్తుల గురించి పట్టించుకోలేదు. పైగా కొంతమంది టీచర్లను డెప్యుటేషన్‌లో తీసుకోవడానికి చూస్తున్నారని తెలియడంతో 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో రెండురోజుల క్రితం 'సమగ్రశిక్షలో చోద్యం, మళ్లీ డెప్యుటేషన్ల పేరుతో వివాదం' అనే కథనం ప్రచురితమయింది. డెప్యుటేషన్‌పై ఎవరినీ నియమించుకోరాదని కమిషనర్ విజయరామరాజు పదేపదే హెచ్చరిస్తున్నారు. అయినా వారు అనుకున్నట్లే నలుగురు టీచర్లను ఎస్ఎస్ఏకు డిప్యుటేషన్లు వేశారు. ఇందులో హెచ్ఎం ప్రహ్లాదనాయుడు, మోడల్ స్కూల్స్ హెచ్ఎంలు నారాయణస్వామి, చలపతినాయుడు ఎస్జీ టీచర్ ఆంజనేయులును డిప్యుటేషన్‌లో నియమించుకున్నారు. ఇందుకు డీఈఓ ప్రసాద్‌బాబు ఆమోదం కూడా వేశారు. ఏపీసీ అడిగారని, అక్కడి నుంచి వచ్చిన జాబితా మేరకే ఉత్తర్వులు ఇచ్చానని డీఈఓ అంటున్నారు. ఎస్ఎస్ఏలో జీసీడీఓగా కవిత, అసిస్టెంట్ ఏఎంఓగా ఫణికుమార్ పనిచేస్తున్నారు. ఇందులో కవితకు శాఖలో ఖాళీగా ఉన్న ఐఈడీ కోఆర్డినేటర్ బాధ్యతలను అప్పగించారు. ఫణికుమార్‌కు శాఖలో ఖాళీగా ఉన్న ఏఎంఓ, సీఎంఓ, అలెస్కో సెక్టోరియల్ పోస్టుల బాధ్యతలను అప్పగిస్తూ ఏపీసీ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ నలుగురు టీచర్లను ఎందుకు ఆ శాఖకు డెప్యుటేషన్ వేసుకున్నారో అర్థంకావడంలేదు. ఇంకోవైపు నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులను తీసుకున్న ఎస్ఎస్ఏ అధికారులు నియామకాలు చేపట్టకుండా ఇలా ఎందుకు వ్యవహరిస్తున్నారో తెలియక టీచర్లు సతమతమవుతున్నారు.

పీఎస్ హెచ్‌ఎం నరసింహులు సస్పెన్షన్

అనంతపురం విద్య, జూలై 22(ఆంధ్రజ్యోతి): గార్లదిన్నె మండలం పాతకల్లూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న నరసింహులును సస్పెండ్ చేస్తూ డీఈఓ ప్రసాద్‌బాబు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. వారం రోజుల క్రితం ఆ మండల ఎంఈఓలు వెంకటరమణనాయక్, చంద్రానాయక్ కలిసి నరసింహులు పనిచేస్తున్న పాఠశాలకు వెళ్లారు. రికార్డులు, పనితీరు సరిగా లేవని షోకాజ్ నోటీసు ఇవ్వడానికి ఎంఈఓలు నిర్ణయం తీసుకున్నారు. ఇంతకు ముందే ఎంఈఓలు పీఎస్ హెచ్‌ఎం మధ్య మనస్పర్థలు ఉండడంతో మళ్లీ గొడవకు దిగారు. నరసింహులు, ఆయన కుమారుడు ఎంఈఓలతో వాగ్వాదం చేసుకుంటూ వారి ఫోన్లు లాక్కొని నేలకేసి పగులకొట్టారు. దీనిపై ఎంఈఓలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే విధంగా జిల్లా విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పీఎస్ హెచ్‌ఎం నరసింహులును సస్పెండ్ చేశామని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు.

నైపుణ్యాలతోనే నవ భారత్: ఎంపీ అంబికా



వార్షికోత్సవంలో ఎంపీ అంబికా

అనంతపురం క్రైం, జూలై 22(ఆంధ్రజ్యోతి): యువతలో నైపుణ్యాలను పెంచితే దేశం నవ భారత్ వైపు పయనిస్తుందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. ఢిల్లీలోని భారత్ మండపంలో మంగళవారం నిర్వహించిన స్కిల్ ఇండియా మిషన్ 10వ వార్షికోత్సంలో ఆయన ప్రసంగించారు. కేంద్ర నైపుణ్యాభివృద్ధిశాఖ మంత్రి జయంత్ చౌదరి, కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పదేళ్లుగా స్కిల్ ఇండియా మిషన్ లక్షలాది మందిలో నైపుణ్యాలను పెంచి ఉద్యోగావకాశాలు కల్పిస్తోందని ఎంపీ అన్నారు. ఇది భవిష్యత్తు భారతానికి పునాది వంటిదని అన్నారు. నైపుణ్యం ఉన్న యువత దేశ నిర్మాణానికి ముఖ్య ఆధారమని అన్నారు. యువతను శిక్షణతో శక్తివంతులుగా తీర్చిదిద్దే ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని ఎంపీ తెలిపారు.

నకిలీలతో రైతన్నకు మోసం..!

- తక్కువ ధరలకే క్రిమిసంహారక మందులు
- నిలువునా ముంచుతున్నా పట్టించుకోని అధికారులు
- కొరవడిన పర్యవేక్షణ



తనకల్లు, జూలై 22(ఆంధ్రజ్యోతి): నకిలీ క్రిమి సంహారక మందులను సరఫరా చేస్తూ కొందరు ఎరువుల దుకాణదారులు రైతులను మోసగిస్తున్నారు. బయో పేరుతో ఎమ్మార్పీ కంటే తక్కువకే విక్రయిస్తూ రైతును నిండా ముంచుతున్నారు. రసాయన ఎరువుల విక్రయాల్లో ఎమ్మార్పీకి విక్రయించాలంటూ సంబంధిత వ్యవసాయశాఖ అధికారులు ఎరువుల దుకాణ యజమానులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. తనిఖీల సమయంలో ఎరువులకు సంబంధించిన పీసీ (ప్రొడ్యూసర్ కంపెనీ)లు లేకపోతే వాటిని సీజ్ చేస్తున్నారు. దుకాణదారులు ఎరువులతోపాటు క్రిమిసంహారక మందులును కూడా విక్రయిస్తున్నాయి. 250 నుంచి 300 పైచిలుకు రకాల క్రిమిసంహారక మందులను విక్రయాలు కొనసాగిస్తున్నారు. వీటిలో కూడా పీసీలు ఉంటేనే విక్రయించాలన్న నిబంధనలున్నాయి. కొంతమంది ఎరువుల దుకాణదారులు పీసీలో పొందపరచని క్రిమిసంహారక మందులు, డ్రిప్ ఎరువులను వివిధ ఏజెన్సీల ద్వారా తక్కువ ధరలకు కొనుగోలు చేసి, అధికారుల కన్ను కప్పి, రైతులకు ఎమ్మార్పీకంటే తక్కువకు విక్రయిస్తున్నారు. దీంతో లైసెన్సులు పొంది, సక్రమంగా వ్యాపారం నిర్వహించే కొంతమంది తమ వ్యాపారాలను కొనసాగించలేకపోతున్నారు. ఎలాంటి పీసీ లేకుండా వివిధ ఏజెన్సీల ద్వారా తక్కువ ధరకు కొనుగోలు చేసిన, బయో మందులు(నకిలీ)వాటి పైనున్న ధరలకంటే తక్కువగా విక్రయిస్తున్నారు. నిజమైన కంపెనీల నుంచి పొందిన డ్రిప్పు మందులను, బయోలను వ్యాపారులు అమ్ముకోలేక ఇబ్బంది పడుతున్నారు. రసాయన కంపెనీల నుంచి అనుమతి పొందిన ఏజెన్సీలు ఆ ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీలకే విక్రయిస్తున్నారు. దీంతో ఎరువుల దుకాణదారులు ట్రాన్స్‌పోర్టు, కూలీలు, వడ్డీలు, లాభం కోసం ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే ఎక్కువగా విక్రయించాల్సి వస్తోందని అంటున్నారు. ఇంత జరుగుతున్నా, సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించి, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చే ఎరువులను ఎమ్మార్పీలకు విక్రయించలేని వ్యాపారులు.. వివిధ కంపెనీలు సరఫరా చేసే క్రిమిసంహారక మందులు, డ్రిప్ ఎరువులను ఎమ్మార్పీ కంటే తక్కువ కు విక్రయిస్తుండడం చర్చనీయాంశమైంది. ఎన్నో మోసపూరిత కంపెనీలు తమ బ్రాండ్ల పేరుతో నకిలీలను విక్రయిస్తున్నట్లు ఇటీవల రైతులు కూడా గుర్తిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తనిఖీలు చేసి నకిలీల నిగ్గు తేల్చాలని రైతులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఎరువుల దుకాణదారులు తమ వద్ద ఉన్న పీసీల్లో లేని బయోలు, క్రిమిసంహారక మందులు, డ్రిప్ ఎరువులు, విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే ఆకస్మిక దాడులు నిర్వహించి, కఠిన చర్యలు తీసుకుంటాం. రైతుకు మోసం జరిగే ఏ కార్యక్రమమైనా చట్టవిరుద్ధమే.

- సనావుల్లా, ఏడీ, వ్యవసాయశాఖ

మోసపోతున్నాం..



పంటలకు వచ్చే వివిధ రకాల పురుగులు, తెగుళ్ల నివారణ కోసం మందులను కొనుగోలుచేసి పిచికారి చేస్తున్నాం. ఇందులో కంపెనీలు విక్రయించే వాటికన్నా, బయోలు తక్కువ ధరకే విక్రయిస్తుండడంతో నష్టపోతున్నాం. డ్రిప్ ఎరువులు, కంపెనీల ఎరువులకు, బయోల ఎరువులకు చాలా తేడా ఉంది. ఎరువుల దుకాణదారులు పురుగుల మందులను తక్కువ ధరలకు విక్రయించడం, ఎరువులకు ఎక్కువ ధరకు విక్రయించడం ఈ మతలబు ఏమిటో అంతు చిక్కడంలేదు.

- శ్రీధర్‌రెడ్డి, రైతు, సున్నంపల్లివారిపల్లి

డ్రిప్ ఎరువుల్లో భారీ మోసం



డ్రిప్ ఎరువులు, పురుగు మందుల్లో రైతులకు భారీగా మోసం జరుగుతోంది. ఏవి నకిలీవో, ఏవి అసలువో అంతుచిక్కడంలేదు. ఎరువుల దుకాణదారులు పురుగు మందులను, డ్రిప్ ఎరువులను ఎమ్మార్పీ కంటే తక్కువకే విక్రయిస్తున్నారు. రసాయన ఎరువులను మాత్రం విక్రయించడంలో ఇబ్బందులున్నట్లు చెబుతారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ విషయాలపై పర్యవేక్షించి, రైతులకు సక్రమమైన ఎరువులు, క్రిమిసంహారక మందులు, డ్రిప్ ఎరువులు అందేలా కృషిచేయాలి.

- సూర్యనారాయణ, రైతు, కొత్తకురవపల్లి

చెత్తగా.. చెత్త సేకరణ

ఎంపీడీఓలు, డిప్యూటీలకు మెమోలు ఇవ్వండి

ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ



అనంతపురం కలెక్టరేట్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఇంటింటి చెత్త సేకరణలో పలు మండలాల్లో 50శాతం కన్నా ఎక్కువ నెగెటివ్ వచ్చిందని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ అన్నారు. ప్రభుత్వ ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ఈ విషయం స్పష్టమైందని అన్నారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి పంచాయతీ సెక్టార్, జీఎస్‌డబ్ల్యూఎస్ తదితర అంశాలపై డీపీఓ, డీఎల్డీఓలు, డీఎల్పీఓలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్‌లు, ఈఓఆర్డీలతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చెత్త సేకరణ విషయంలో నిర్లక్ష్యం వహించిన ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలకు మెమోలు ఇవ్వాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల (జీఎస్‌డబ్ల్యూఎస్) పెండింగ్ అంశాల పూర్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తల్లికి వందనం కోసం తల్లి, బిడ్డల ఈకేవైసీని వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఏపీ సేవా సర్వీసెస్ డాష్‌బోర్డు, మన మిత్ర క్యాంపెయిన్‌లో పెండింగ్ అంశాలను రెండు రోజుల్లో పూర్తి చేయాలని అన్నారు. సిటిజన్ ఈకేవైసీ, ఆధార్ సీడింగ్ ఫర్ వాహన్ డేటాను వేగంగా చేపట్టాలని అన్నారు. సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్ 100శాతం నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సరిగా పనిచేయనివారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌ను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని, సచివాలయాలలో క్యూఆర్ కోడ్ పెట్టాలని, ప్రజల ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని ఆదేశించారు. వీసీలో డీపీఓ నాగరాజు నాయుడు, సీపీఓ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

బాలగంగాధర తిలక్ (జయంతి)



'స్వరాజ్యం నా హక్కు' అనే నినాదంతో స్వాతంత్ర్య సంగ్రామంలో ముందుకు సాగిన బాలగంగాధర తిలక్ 1856 జూలై 23న మహారాష్ట్రలోని రత్నగిరి ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు కేశవ గంగాధర తిలక్. భారత స్వాతంత్ర్యోద్యమానికి తొలి నాయకుడిగా పరిగణిస్తారు. 'లాల్ బాల్ పాల్' త్రయంలో ఒకరు. 'లోకమాన్య' బిరుదు పొందారు. 'ది మేకర్ ఆఫ్ మాడ్రన్ ఇండియా'గా గాంధీజీచే పిలవబడ్డారు. 1920 ఆగస్టు 1న కన్నుమూశారు. 1956లో పార్లమెంటు భవనంలో ఆయన చిత్రపటాన్ని కొలువుదీర్చారు. 2007లో 150వ జయంతికి ప్రత్యేక నాణెం విడుదల చేశారు.

సిస్టర్ నిర్మల (జయంతి)



'పద్మ విభూషణ్' గ్రహీత సిస్టర్ నిర్మల 1934 జూలై 23న రాంచీలో జన్మించారు. అసలు పేరు నిర్మలా జోషి. నోబెల్ పురస్కార గ్రహీత 'మదర్ థెరెసా' తర్వాత 'మిషనరీస్ ఆఫ్ చారిటీ'కి సుపీరియర్ జనరల్‌గా బాధ్యతలు ఆమె చేపట్టారు. హిందూ కుటుంబంలో జన్మించినా మదర్‌థెరెసా స్ఫూర్తితో కేథలిక్ ధర్మాన్ని స్వీకరించారు. నిరుపేదలు, సామాన్యుల సేవలో తరించారు. ప్రపంచవ్యాప్తంగా 134 దేశాలలో ఆమె సామాజిక సేవలు కొనసాగాయి. 2015 జూన్ 23న కన్నుమూశారు.

కోడి రామకృష్ణ (జయంతి)



తెలుగు సినీరంగంలో ప్రముఖ దర్శకుడు కోడి రామకృష్ణ 1949 జూలై 23న పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో జన్మించారు. 1982లో 'ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య' సినిమాతో టాలీవుడ్‌లోకి ప్రవేశించారు. నుదురుకు ప్రత్యేకమైన తలపాగా ధరించి భిన్నమైన మేనరిజం ఆయన ప్రత్యేకతగా చెప్పొచ్చు. 37 ఏళ్ల కెరీర్‌లో 202 సినిమాలను రూపొందించారు. ముద్దుల మావయ్య, మంగమ్మగారి మనవడు, భారత్ బంద్, అరుంధతి, పుట్టింటికి రా చెల్లి తదితర హిట్ సినిమాలు ఉన్నాయి. తెలుగులోనే కాక తమిళ, కన్నడ, హిందీ, మళయాళ సినిమాలకు కూడా దర్శకత్వం వహించారు. దర్శకుడిగానే కాక స్క్రీన్ రైటర్‌గా, నటుడిగాను రాణించారు. రఘుపతి వెంకయ్య అవార్డు గ్రహీత. 2019 ఫిబ్రవరి 22న కన్నుమూశారు.

డాక్టర్ ఎల్ సుబ్రమణియమ్ (పుట్టినరోజు)



'పద్మ విభూషణ్' పురస్కార గ్రహీత డాక్టర్ లక్ష్మీనారాయణ సుబ్రమణియమ్ 1927 జూలై 23న మద్రాస్‌లో జన్మించారు. ఎంబీబీఎస్ పూర్తి చేసినా సంగీతంపై మక్కువతో వెస్ట్రన్ క్లాజికల్ సంగీతంలో మాస్టర్స్ డిగ్రీ అందుకున్నారు. వయోలినిస్ట్, స్వరకర్త, నిర్వాహకుడు. సంప్రదాయ కర్ణాటక సంగీతంలోనూ, పాశ్చాత్య సంగీతంలోనూ రాణించారు. 200కుపైగా రికార్డింగ్స్ చేశారు. సంగీతం, ఆర్కెస్ట్రా, బ్యాలెట్స్‌తోపాటు హాలీవుడ్ ఫిల్మ్‌స్కోర్స్‌కు సంబంధించి రచనలు చేశారు. పద్మభూషణ్ పురస్కారం, ఇస్కాన్ బెంగళూరుకు ఆస్థాన విద్వాన్‌గాను, ఇంకా విశ్వ కళాభారతి, సంగీతా కళారత్న, సంగీతా కళా శిరోమణి, బెంగళూరు యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ తదితర గౌరవాలు అందుకున్నారు.

సూర్య (పుట్టినరోజు)



సూర్య 1975 జూలై 23న చెన్నైలో జన్మించారు. తమిళ సినీరంగంలో అత్యధిక పారితోషికం అందుకుంటున్న నటులలో ఒకరు. ప్రముఖ నటుడు శివకుమార్ కుమారుడు. నిర్మాత, టెలివిజన్ వ్యాఖ్యాతగా కూడా రాణించారు. తెలుగులోనూ పలు సినిమాల్లో నటించారు. 2డీ ఎంటర్ టైన్‌మెంట్ ప్రొడక్షన్ హౌస్ ఏర్పాటు చేశారు. బుల్లితెరపైనా రాణిస్తున్నారు. 3 తమిళనాడు రాష్ట్ర సినీ అవార్డులు, 4 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, ఇతర పురస్కారాలు అందుకున్నారు. సినీనటి జ్యోతికను పెళ్లి చేసుకున్నారు. అగరం ఫౌండేషన్ ద్వారా సామాజికసేవలు అందిస్తున్నారు. ఆయన తమ్ముడు కార్తి కూడా సినీ రంగంలో పేరొందారు.

డేనియెల్ ర్యాడ్‌క్లిఫ్ (పుట్టినరోజు)



డేనియెల్ జాకబ్ ర్యాడ్‌క్లిఫ్ 1989 జూలై 23న జన్మించారు. ఆంగ్ల నటుడు. హ్యారిపాటర్ పాత్రతో పాటు 'హ్యారిపాటర్ ఫిల్మ్ సిరీస్'లో నటించి ప్రపంచగుర్తింపు పొందారు. పదవ యేట బీబీసీ వన్ టెలివిజన్ ఫిల్మ్ 1989లో 'డేవిడ్ కాపర్‌ఫీల్డ్'లో నటించారు. అత్యధిక పారితోషికం అందుకుంటున్న నటులలో ఒకరిగా నిలిచారు. లెక్కకు మిక్కిలి పురస్కారాలు అందుకున్నారు.

పరిశ్రమలకు సాగుభూములు ఇవ్వం

» రైతుసంఘం హెచ్చరిక

బంగారపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల అభివృద్ధి పేరిట పచ్చటి సాగు భూములను బలవంతంగా లాక్కోవాలని చూస్తే ఇచ్చేది లేదని రైతుసంఘం ఉపాధ్యక్షుడు కే నారాయణగౌడ పేర్కొన్నారు. ఆదర్శరైతు మరగల్ శ్రీనివాస్ తోటలో 1980 దశకంలో నరగుంద, నవలగుంద తాలూకాలలో డిమాండ్ల సాధనకై తాలూకా కార్యాలయం వద్ద పాల్గొన్న నిరసనలో అన్నదాతలపై అప్పటి గుండూరావు ప్రభుత్వం తహసీల్దార్ విధులకు అడ్డుగా ఉన్నారంటూ గోలీబార్ చేశారన్నారు. అప్పట్లో మృతి చెందిన అమరవీరులైన రైతులకు నివాళులు అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించిన అనంతరం నారాయణగౌడ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమలు చేసిన 3 చట్టాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడంతో సుదీర్ఘ పోరాటం అనంతరం ఎట్టకేలకు ఉపసంహరించుకుందన్నారు. అదే రీతిన దేవనహళ్ళి తాలూకా చన్నరాయ పట్టణ హోబళిలో 13 గ్రామాలలో 1777 ఎకరాలను కేఐఏడీబీ స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించగా 1198 రోజుల పోరాటంతో రాష్ట్రప్రభుత్వం ప్రక్రియను ఉపసంహరించుకుందన్నారు. ఆదర్శరైతు మరగల్ శ్రీనివాస్ మాట్లాడుతూ కేసీవ్యాలీ మూడో దశ శుద్ధీకరణ చేపట్టాలని, నకిలీ విత్తనాలు, మందుల నియంత్రణకు బలమైన చట్టాలు కావాలన్నారు. అతివృష్టి, అనావృష్టి వల్ల తలెత్తే నష్టాలకు శాస్త్రీయంగా పరిహారం ఇవ్వాలన్నారు. అభివృద్ధి పేరిట భూములు స్వాధీనం చేసుకునే ప్రక్రియ విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లాధ్యక్షుడు ఈకంబళ్ళి మంజునాథ్, గిరీశ్, పుత్తేరి రాజుశైలజ, రత్నమ్మ, గిరిజ, వెంకటమ్మ, చౌడమ్మ తదితరులు పాల్గొన్నారు.



అమరులైన రైతులకు నివాళి అర్పిస్తున్న అన్నదాతలు

గ్రామానికి ఆర్టీసీ బస్సు సేవలు

ముళబాగిలు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని దేవరాయసముద్ర గ్రామ పంచాయతీ పరిధిలోని కీళహోళలి గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రారంభించారు. డీసీసీ బ్యాంకు డైరెక్టర్ రఘుపతిరెడ్డి మాట్లాడుతూ సుమారు మూడు కిలోమీటర్ల మేర నడిచి వెళ్లేవారని, సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తేగా స్పందించి సానుకూలం చేశారన్నారు. దేవరాయసముద్ర గ్రామపంచాయతీ ఉపాధ్యక్షుడు జమ్మనహళ్ళి కృష్ణప్ప మాట్లాడుతూ సుదీర్ఘకాలం తర్వాత ఆర్టీసీ బస్సు సర్వీసులు గ్రామానికి వచ్చాయన్నారు. కేఎస్ఆర్టీసీ బస్సు సేవలు తొలిసారిగా గ్రామానికి వస్తుండడంతో యువకులు, పిల్లలు సంతోషం వ్యక్తం చేశారు. బస్సును అలంకరించి పూలతో అలంకరించి అందరికీ మిఠాయిలు పంచి పెట్టారు. గ్రామస్తులు చంగలరాయప్ప, కేవీ శ్రీనివాస్, రవీంద్రబాబు, రమాదేవి, సురేశ్, వెంకటరామప్ప, కేవీ వెంకటేశన్, హరీశ్ పాల్గొన్నారు.



డీసీసీ బ్యాంకు డైరెక్టర్ రఘుపతిరెడ్డి తదితరులు

అవయవదానంపై రాష్ట్రమంతటా చైతన్యం కల్పిస్తాం



కావేరి ఆసుపత్రి నెఫ్రాలజీ డైరెక్టర్ రామమోహన్ శ్రీపాద్ తదితరులు

బెంగళూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అవయవదానంపై రాష్ట్రమంతటా చైతన్యం కల్పించదలిచినట్టు కావేరి ఆసుపత్రి నెఫ్రాలజీ డైరెక్టర్ రామమోహన్ శ్రీపాద్ తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ కావేరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మల్టిఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ (టిమోట్) ద్వారా గుండె మార్పిడి సేవలు ప్రారంభించదలిచామన్నారు. సొట్టో కర్ణాటకతో రాష్ట్ర మంతటా శిబిరాలు నిర్వహించి అవయవదానంపై అవగాహన కల్పించదలిచామన్నారు. 2024 నుంచి కావేరి నెట్‌వర్క్ 12 ఆసుపత్రులలో 760కుపైగా కిడ్నీ, కాలేయం, హృదయం, శ్వాసకోశకు సంబంధించి అవయవదానం ఆపరేషన్లు చేశామన్నారు. 93శాతం విజయవంతం అయ్యాయన్నారు. ఆగస్టు 13న విశ్వఅవయవదానం దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

శిడ్లఘట్ట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కుందలగుర్కిలో ఏబీడీ ట్రస్టు ఆధ్వర్యంలో తాలూకాస్థాయి క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. విజేత జట్టుకు కేపీసీసీ కన్వీనర్ రాజీవ్‌గౌడ ట్రోఫీ అందచేసి మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులు వెనుకడుగు వేయడం ద్వారా అవకాశాలు కోల్పోతున్నారన్నారు. ప్రపంచంలో కులమతాలకు అతీతంగా అందరినీ దగ్గర చేసే శక్తి క్రీడలకు ఉందన్నారు. యువత తమకు ఇష్టమైన రంగంలో సాధన చేయడంతోపాటు సామాజిక సేవ కూడా చేయాలని పిలుపునిచ్చారు. సాధారణంగా గ్రామీణ విద్యార్థులు ఇంగ్లిష్, గణితం, సైన్స్ సబ్జెక్టులలో కొంత వెనుకబడి ఉంటారన్నారు. కాగా ట్రస్టు తరపున ఐఏఎస్, కేఏస్, బ్యాంకింగ్ పోటీ పరీక్షలకు ఉచితంగా కోచింగ్ ఇస్తున్నట్టు తెలిపారు. కాగా క్రికెట్ పోటీలకు 30కుపైగా జట్లు పాల్గొన్నాయి. ప్రథమస్థానం సాధించిన ఉలపనహళ్ళి జట్టుకు రూ.40వేలు, ట్రోఫీ అందచేశారు. ద్వితీయస్థానం పొందిన కుందలగుర్కి జట్టుకు రూ.30వేలు, తృతీయస్థానం పొందిన ఆదిగెరె జట్టుకు రూ.10 వేల నగదు, ట్రోఫీ అందచేసి అభినందించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు వెంకటేశప్ప, మునీంద్ర, వెంకటేశ్, కృష్ణారెడ్డితోపాటు గ్రామ పంచాయతీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీలతో విజేత జట్టు సభ్యులు

1 నుంచి ఇండియన్ ఆర్టిసన్స్ చేతివృత్తుల మేళా



బెంగళూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): నగరం లోని ఎంజీరోడ్డు రంగోళి మెట్రో కళాకేంద్రంలో ఆగస్టు 1నుంచి పదిరోజులపాటు ఇండియన్ ఆర్టిసన్స్ హాత్ పేరిట చేతివృత్తుల మేళా నిర్వ హిస్తున్నారు. వివిధ రాష్ట్రాలనుంచి కళాఖండాల ప్రదర్శనకు ఆహ్వానిస్తున్నారు. సుమారు 100 స్టాల్స్ ఏర్పాటు చేయదలిచినట్టు నాగరాజ్ తెలిపారు. దేశంలోని ప్రతిరాష్ట్రంలోనూ విశిష్టమైన వస్తువులు, డిజైన్లకు చరిత్ర ఉందని వాటన్నింటినీ ఒకేచోట నగర ప్రజలకు అనుగుణంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. తంజావూర్ పెయింటింగ్స్, తెలంగాణ ఇక్కత్ కాటన్ చీరలు, ఒడిశా కళాఖండాలు, బీహార్ బగల్‌పూర్ చీరలు, పంజాబీ పుల్కారీ వస్త్రాలు, తెలంగాణ పోచంపల్లి చీరలతో పాటు పలు బ్రాండ్లను పరిచయం చేస్తున్నామన్నారు. చన్నపట్టణ బొమ్మలు ఎలా తయారు చేస్తారో మేళాలో చూడవచ్చునన్నారు. పది రోజులపాటు మేళా కొనసాగనుందన్నారు. ప్రదర్శనలో భాగంగా ప్రతిరోజూ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రముఖ కళాకారులనుంచి వయోలిన్ వాదన, హిందూస్తానీ సంగీతం, పిల్లనగోవి వాదన, శెహనాయ్, తబలా, నృత్యం, జానపద కళలు ప్రదర్శించనున్నట్టు తెలిపారు.

మహిళకు ఫోన్‌లో వేధింపులు

కేసు నమోదు చేసిన పోలీసులు

హిందూపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఓ మహిళతో తెలుగుతమ్ముడు ఫోన్‌లో అసభ్యకరంగా మాట్లాడిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పట్టణంలోని మేళాపురంలో నివాసమున్న ఓ వివాహిత గత ఆరేళ్లుగా హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో శానిటేషన్ విభాగంలో వర్కర్‌గా పనిచేస్తుంది. అయితే ఈమె విధుల్లో నిర్లక్ష్యంగా ఉండటంతో ఒకటన్నర నెల క్రితం వైద్యుల సూచనమేరకు శానిటేషన్ కాంట్రాక్టర్ ఆమెను తప్పించారు. అయితే కొద్దిరోజుల క్రితం లేపాక్షి మండలం బిసలమానేపల్లికి చెందిన టీడీపీకి చెందిన కగ్గల్లప్ప సదరు మహిళతో ఫోన్‌లో మాట్లాడుతూ నీకు తిరిగి ఉద్యోగం ఇప్పిస్తానని తనకు కమిట్మెంట్ ఇవ్వాలని కోరాడు. ఈ విషయాన్ని ఈనెల 16న సదరు మహిళ ఎమ్మెల్యే పీఏ దృష్టికి తీసుకెళ్లింది. దీంతో వారు వెంటనే కార్యకర్తపై పోలీసులకు చెప్పి కేసు నమోదుచేయించారు. పార్టీ నుంచి కూడా సస్పెండ్ చేశారు. అంతకు ముందు కగ్గాలప్ప ఆ మహిళలో మాట్లాడిన ఆడియోను సోమవారం సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఈ ఆడియోను వైరల్ చేసింది వైసీపీ నాయకులంటూ టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. అయితే వైసీపీ నాయకులు పట్టణానికి చెందిన యుగంధర్‌పై ఆరోపణలు చేశారు. మహిళతో కగ్గాలప్ప ఫోన్‌లో అసభ్యకరంగా మాట్లాడారని చెప్పిన వెంటనే మహిళతో తామే ఎమ్మెల్యే పీఏ దృష్టికి తీసుకెళ్లి ఆయనను పోలీసులకు పట్టించామని యుగంధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల వైసీపీ నాయకుడు చేసిన అరాచకాలను ప్రశ్నిస్తుంటే వారు తనపై ఆరోపణలు చేస్తున్నారని దీనిపై చట్టపరంగా ముందుకెళ్తానన్నారు.

ఆటోను ఢీకొన్న కారు.. పలువురికి గాయాలు

లేపాక్షి, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కుర్లపల్లి గ్రామంవద్ద మంగళవారం ఆటోను కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో పలువురు మహిళలకు గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. కొండూరు గ్రామానికి చెందిన 15 మంది మహిళలు గార్మెంట్స్‌లో పని ముగించుకుని సాయంత్రం తిరుగు ప్రయాణంలో ఆటోలో వెళ్తున్నారు. అదే సమయంలో కొండూరు గ్రామం నుంచి కారు అతివేగంగా లేపాక్షి వైపు వచ్చింది. కుర్లపల్లి వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను కారు ఢీకొంది. ప్రమాదంలో ఆటో, కారు నుజ్జు నుజ్జు కాగా ఆటోలో ప్రయాణిస్తున్న 15మందిలో ఐదుగురు మహిళలకు తీవ్ర గాయాలు, మిగిలినవారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సబ్సిడీతో కంది విత్తనాలు పంపిణీ

రొద్దం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీతో అందించే కంది విత్తనాల పంపిణీని టీడీపీ నాయకులు, వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం ప్రారంభించారు. రైతుసేవాకేంద్రం-1లో కంది విత్తనాల పంపిణీ చేపట్టారు. ప్రతి రైతుకు ఎకరాకు 3కిలోల చొప్పున కంది విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారి రాజేష్ తెలిపారు. అవసరమైన రైతులు ఆయా రైతు సేవాకేంద్రాల్లో పొందవచ్చన్నారు. కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్ తెలుగు మహిళ అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నారప్ప, చంద్రమౌళి, టీడీపీ నాయకులు టైలర్ ఆంజనేయులు, నరసింహులు, అశ్వర్థ నారాయణ పాల్గొన్నారు. మొక్కజొన్నపంట సాగుచేసిన రైతుల పొలంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ అధికారులు చేపట్టారు.

హుండీ ఆదాయం లెక్కింపు

అమరాపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్ధేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపును మంగళవారం ఈఓ నరసింహరావు, ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ, ఎస్సీ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్ చేపట్టారు. రూ.3,76,542 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ సురేష్, పంచాయతీ కన్వీనర్ తిప్పర్ల, రామచంద్రప్ప, కృష్ణమూర్తి, సిద్ధేశ్వర, కుమారస్వామి, శ్రీనివాస్, ఆలయ కమిటీ ధర్మకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తుమ్మల మారెమ్మకు ప్రత్యేక పూజలు

గుడిబండ, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడిబండలో వెలసిన తుమ్మల మారెమ్మ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

మణూరుతండాలో..

మడకశిర రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మణూరుతండాలో మంగళవారం మారెమ్మకు దేవత ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తండావాసులతో మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నాగరాజు, జనరల్ కార్యదర్శి మారుతిరెడ్డి, దేవరాజ్ నాయక్ కార్యకర్తలు పాల్గొన్నారు.

విశేష అలంకరణలో వడిసలమ్మ



మడకశిర టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆషాడమాసాన్ని పురస్కరించుకుని చివరి మంగళవారం వడిసలమ్మను రంగు రంగు పూలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అమరాపురం బస్టాండ్ ఆవరణంలో వెలసిన వడిసలమ్మ అమ్మవారికి, గంగభవిని, కొల్లపురమ్మ, కన్యకా పరమేశ్వరి, ములకంతేశ్వరి అమ్మవార్లకు ప్రత్యేకంగా అలంకరణ, ప్రాకారోత్సవం, విశేష అర్చనలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు, భక్తుల కోర్కెలు తీర్చే దేవతగా అమ్మవార్లను భక్తులు పూజలు నిర్వహించారు. పట్టణంలోని అనేక మంది భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు, వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

శాకంబరిగా గోదాదేవి



హిందూపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో ఆషాఢమాసం ఆఖరి మంగళవారాన్ని పురస్కరించుకుని గోదాదేవి, రమాదేవి అమ్మవార్లకు శాకంబరిగా అలంకరించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దఎత్తున పూజల్లో పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

హిందూపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని ఆటోనగర్ భగీరథ సర్కిల్‌లో వెలసిన మారెమ్మదేవి ఆలయ 27వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో అలంకరించారు. అమ్మవారికి బియ్యం పిండితో చేసిన జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు.

విద్యార్థులకు ఆరోగ్య కిట్ల పంపిణీ



కిట్లతో విద్యార్థులు

దొమ్మసంద్ర, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా సాయి మాయి ట్రస్టు ఆధ్వర్యంలో దంత ఆరోగ్య కిట్లను పంపిణీ చేస్తున్నారు. చిత్రదుర్గ జిల్లా హిరియూరు తాలూకాలోని 115 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో సుమారు 5600మందికి పాఠశాల కిట్లతోపాటు ఆరోగ్య స్వచ్ఛతా కిట్లను పంపిణీ చేశారు. ట్రస్టు ముఖ్యులు సాయిరా హరిశంకర మాట్లాడుతూ ట్రస్టుకు చెందిన 70మంది వలంటీర్లు, 9 బృందాలుగా హిరియూరు తాలూకా వ్యాప్తంగా కిట్లను పంపిణీ చేశారన్నారు. హృదయస్పందన సంస్థ అవసరాల సత్యసాయిప్రసాద్ మాట్లాడుతూ భగవాన్ సత్యసాయిబాబా ఆశీర్వాదంతో గ్రామీణ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పోటీ ప్రపంచంలో ధైర్యంగా నిలబడేందుకు తమవంతుగా వారిని ప్రోత్సహిస్తున్నామన్నారు. 90వేల నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, డ్రాయింగ్ నోట్స్, గ్రాఫ్ పుస్తకాలు, 80వేల లేఖనా సామగ్రి, 5,500 స్కూల్ బ్యాగులు, ఇంకా దంత ఆరోగ్య స్వచ్ఛతా కిట్‌లు పంపిణీ చేసినట్టు తెలిపారు. బీఈఓ ప్రసన్న మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయమని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ట్రస్టుకు చెందిన జగదీశ్ శెట్టర్, శైలేశ, శ్రీనివాస్, గురురాజ హెబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఆత్మీయ ఆహ్వానం



మంత్రితో పూర్వ విద్యార్థుల సంఘం పదాధికారులు

విజయపుర, జూలై 22(ఆంధ్రజ్యోతి): విజయపుర పట్టణానికి విచ్చేసిన పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి మునియప్పకు ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం 80వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్మీయంగా ఆహ్వానించింది. పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు వీఎం కిశోర్ కుమార్, కార్యదర్శి డాక్టర్ ఎం శివకుమార్, సలహా సమితి సభ్యుడు దిన్నూరు వెంకటేశ్‌లు పాల్గొన్నారు. నగరంలోని మంత్రి నివాసానికి చేరుకున్న సంఘం పదాధికారులు వార్షికోత్సవ స్మరణ సంచిక ఆవిష్కరణకు విచ్చేయాలని ఆహ్వానించగా సానుకూలం వ్యక్తం చేసినట్టు తెలిపారు.

మార్కెట్‌లోకి ఓప్పో కొత్త ఫోన్‌లు

బెంగళూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఓప్పో ఇండియా రెనో 14 సిరీస్‌లో కొత్త మోడల్స్ మొబైల్స్‌ను విడుదల చేసింది. బెంగళూరులో మంగళవారం ప్రొడక్ట్ కమ్యూనికేషన్ స్పెషలిస్ట్ ఉపాసన ఫోన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉపాసన మాట్లాడుతూ మొబైల్ లేకుండా గడిపే పరిస్థితి లేకుండా పోయిందని, అందుకే ఎంపిక చేసుకునే ఫోన్‌లో ఆధునాతన సాంకేతిక విధానాలు ఎంపిక చేసుకోవాలన్నారు. కెమెరా, వైర్‌లెస్ చార్జింగ్‌తోపాటు సాంకేతికతకు అనుగుణంగా నాణ్యమైన ఫోటోలు సాధ్యమన్నారు.

నగరమంతటా ముసురు



కెంగేరి మెట్రో స్టేషన్ వద్ద కమ్ముకున్న కారుమేఘాలు


బెంగళూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నగరవ్యాప్తంగా మంగళ వారం ముసురు కమ్ముకుంది. ఉదయం నుంచి సాయంత్రం దాకా పలు ప్రాంతాలలో వర్షం కురిసింది. విద్యా ర్థులు, ఉద్యో గులు ఇబ్బంది పడ్డారు. బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌ల వద్ద గొడుగులతో తిరిగారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా నాలుగు జిల్లాల్లో రెడ్ అలర్ట్ కొనసాగుతోంది. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

గోరంట్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలిగిరి గ్రామానికి చెందిన రైతు వెంకటరెడ్డి పాముకాటు గురై మంగళవారం అస్వస్థతకు గురయ్యాడు. ఆదినారాయణ కుమారుడైన వెంకటరెడ్డి ఇంటిముందు శుభ్రం చేస్తుండగా పాము ఎడమచేతిపై కాటు వేసింది. వెంటనే గోరంట్ల ఆసుపత్రికి తరలించగా డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్స చేసి, అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం పంపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడిదగడ్డపల్లికి చెందిన 24 ఏళ్ల యువకుడు విషద్రావకం తాగి మంగళవారం ఆ త్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పుట్టింటికి వెళ్లిన భార్య కాపురానికి రాలేదని మనస్థాపం చెందిన యువకుడు విషద్రావకం తా గాడు. కుటుంబసభ్యులు గోరంట్ల ఆసుపత్రికి తరలించగా చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.88	1,627.21
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	36,539	1,13,402
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	39,457	4,798
నీటి నిల్వ (టీఎంసీలు)	79.40	83.95

శరవేగంగా సెంట్రల్ జైలు ఆధునికీకరణ పనులు



కొనసాగుతున్న ప్రహరీ నిర్మాణ పనులు

బళ్లారి, జూలై 22(ఆంధ్రజ్యోతి): బ్రిటీష్‌వారు పాలిస్తున్న రోజుల్లో నిర్మించిన బళ్లారి సెంట్రల్ జైలులో ఆధునికీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ జైలును 1840లో 16 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. రాష్ట్రంలోనే బళ్లారి జైలుకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడ కట్టుదిట్టమైన భద్రత ఎక్కువ. రాష్ట్ర జైలు శాఖ అధికారులు గతంలో పర్యవేక్షణ జరిపిన నేపథ్యంలో బళ్లారి జిల్లాలో ఖైదీలకు, అలాగే సిబ్బందికి మౌలిక వసతులు కల్పనతో పాటు జైలు కాంపౌండ్ వాల్ ఎత్తు పెంచాలని తీర్మానించారు. రూ.కోటి నిధులతో యూజీడీ పనులు, ఖైదీలు వినియోగిస్తున్న నీటి నిల్వ తొట్టి నిర్మాణం, మహిళా ఖైదీలకు బాత్‌రూంలు, సిబ్బంది భోజనశాల, జైల్లో అన్ని విభాగాలకు విద్యుత్ సౌకర్యం, లాంటి పనులు చేపట్టారు. జైలు ప్రధాన ద్వారం వద్ద గేటు మినహా మిగిలిన అన్ని చోట్ల కాంపౌండ్ వాల్ ఎత్తు పెంచారు. జైలులో సెల్‌ఫోన్ పని చేయకుండా జామర్లు ఏర్పాటు చేశారు. జైలు నుంచి 200 మీటర్ల దూరం వరకూ సిగ్నల్ అందకుండా జామర్లు ఏర్పాటు చేశారు. అయితే దీని వల్ల జైలు సమీపంలో నివాసం ఉండే వారు తమ ఫోన్లు పనిచేయడం లేదని ఫిర్యాదు చేశారు.



సెంట్రల్ జైలు ప్రధాన ద్వారం

‘ఉపాధి’పై కేంద్ర బృందం ఆరా



అధికారులు, కూలీలతో మాట్లాడుతున్న కేంద్ర అధికారులు

కంప్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని పలు గ్రామాల్లో ఉపాధిహామీ పనులను మంగళవారం కేంద్ర బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు పని చేసే చోట సౌకర్యాలు, కూలి చెల్లింపులపై ఆరా తీశారు. కేంద్ర అధికారులు డాక్టర్ దయాకర్ రెడ్డి, చూడామణిరెడ్డి బృందం కోళూరు, ఓర్వాయి గ్రామ పంచాయతీలను సందర్శించి వివిధ ప్రాజెక్టులను పరిశీలించారు. గత మూడేళ్లలో కోళూరు పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన భవనం షెడ్ మెటల్‌రోడ్డు, పశువుల షెడ్లు వంటి మెటీరియల్ ఆధారిత పనులను వారు పరిశీలించారు. ప్రధాని ఆవాస్ యోజన కింద నిర్మాణంలో ఉన్న గృహాలు మొదలైన ప్రాజెక్టు కింద కాలువల పూడికతీత పనులు, ఉపాధి పథకం కింద ఏడు ప్లాట్లను సామాజిక అటవీ రంగంలో ఉపాధి హామీ పథకం కింద దానిమ్మ పంటల పెంపకం, ప్రధానమంత్రి సడక్ పథకం కింద ఆదర్శ గ్రామం నుంచి వడ్డట్టి గ్రామం వరకు నిర్మించిన రోడ్ల పనులు, ప్రధాన రహదారితో సహా ఇతర ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం కార్మికులు, లబ్ధిదారులతో చర్చించారు. దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులకు పెన్షన్లు నేరుగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కురుగోడు టీఏపీ ఎగ్జిక్యూటివ్ అధికారులు నిర్మల, టీఏపీ సహాయ సంచాలకులు శివరామిరెడ్డి, పంచాయతీ అభివృద్ధి అధికారులు జుబేదా, ఉద్యానవన శాఖ అధికారులు రాఘవేంద్ర, కిరణ్, సోషల్, ఫారెస్ట్ అధికారి సిరా బాడిగి, ఈసీ చంద్రశేఖర్, టీఏ యర్రిస్వామి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

హోస్పేట,జూలై22(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎల్సీ, ఐటీఐ, డిప్లొమా విద్యార్థులకు స్వల్పకాలిక శిక్షణకు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మరియమ్మనహళ్లి ప్రభుత్వ టూల్‌టాక్స్ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి ఎస్ఎస్ఎల్సీ, ఐటీఐ, డిప్లొమా పాస్ అండ్ ఫెయిల్, బీఈ పాసైన విద్యార్థులకు టూల్ రూమ్ మెషినిస్ట్, సీఎన్‌సీ టెక్నాలజిస్ట్, టర్నర్, మిల్లర్, గ్రైండర్, ఫిట్టర్, ్సఏడీ, సీఏఎం వంటి స్వల్పకాలిక శిక్షణ కోర్సులకు శిక్షణ ఇవ్వబడుతుంది. హోస్పేటలోని హరిహర్ రోడ్‌లోని మరియమ్మనహళ్లిలో ఉన్న గవర్నమెంట్ టూల్ రూమ్, శిక్షణ కేంద్రం జీటీ, టీసీలో శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. వరిన్ని వివరాలకు సెల్: 8722999929, 7795969915, 9845416191 నెంబర్లకు సంప్రందించాలన్నారు. దరఖాస్తులు ఈనెల 31లోపు సమర్పించాలన్నారు.

అక్క కేఫ్ క్యాంటిన్‌కు

సంజీవిని ఎన్ఆర్ఎల్ఎం పథకం కింద జిల్లా పంచాయతీలో ఏర్పాటు చేయనున్న అక్క కేఫ్ క్యాంటీన్‌లో పరిశుభ్రమైన ఆహారాన్ని తయారు చేయడంలో ఆసక్తి ఉన్న, క్యాంటీన్ విభాగంలో కనీసం పది సంవత్సరాలు అనుభవం ఉన్న అర్హత కలిగిన స్వయం సహాయక బృందాల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పంచాయతీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నోంగ్‌జోమ్ మహ్మద్ అక్రమ్ అలిషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని గ్రామ పంచాయతీ పరిధిలోని సంజీవిని గ్రామ పంచాయతీ స్థాయి సమాఖ్యలోని ఆసక్తి ఉన్నఅన్ని స్వయం సహాయకబృందాలు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. జూలై 22నుంచి 28వరకు దరఖాస్తులను సమర్పించాలన్నారు. మరిన్ని వివరాల కోసం ప్రాజెక్ట్ డైరెక్టర్ డివిజన్ జిల్లా మేనేజర్(నైపుణ్యాలు)కళావతిని సెల్: 9538740865 నెంబర్ ద్వారా సంప్రదించాలన్నారు.

ఆదర్శ విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్



ఉపాధ్యాయులతో చర్చిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని హిరల్‌కుడం కాలనీ ప్రభుత్వ ఆదర్శ విద్యాలయాన్ని సోమవారం జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా సందర్శించి పాఠశాల పరిస్థితిని పరిశీలించారు. పాఠశాలలోని 7,9,10 తరగతుల పిల్లల ప్రతిభను పరిశీలించారు. అనంతరం పాఠశాల ప్రహరీ సమస్య, ఇతర ప్రాథమిక సౌకర్యాలను ఆయన సమీక్షించారు. మరమ్మతులకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు, సభ్యులు ఇతరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

బళ్లారి సిటీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): పిల్లలు చిన్ననాటి నుంచే సత్యం మాట్లాడడం అలవాటు చేసుకోవాలని నిజం చెప్పేవారికి ఆత్మశక్తి పెరుగుతుందని స్వామి శారదదేశానంద స్వామి సూచించారు. మంగళవారం బళ్లారి శ్రీరామకృష్ణ వవేకానంద కేంద్రంలో తిప్పేరుద్ర విద్యాసంస్థ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వివేకానందుడు చిన్నప్పుడు ఏకాగ్రతతో ధ్యానం చేసేవారని, అదేశక్తి ఆయనను ఉన్నత స్థానంలో నిలిపిందన్నారు. వారి జ్ఞానపక శక్తి గురువుల పట్ల అమోఘమైన భక్తి అద్వితీయ మైనదన్నారు. గురువులు, పెద్దలను గౌరవించడం చిన్ననాటి నుంచే అలవరచుకోవాలన్నారు. ఈసందర్భంగా కేంద్రం కార్యదర్శి జగన్నాథ, ఎస్‌జీటీ సంస్థ నాగరాజు, అధ్యక్షుడు రుద్రప్ప, శ్రీమతి మంజుల పాల్గొన్నారు.

అంతర్గత రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్లక్ష్యం

● దళిత పోరాట సమితి నాయకుల ఆగ్రహం



మాట్లాడుతున్న దళిత నాయకులు జీఆర్ దేవరాజు

చెళ్లకెర, జూలై 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం దళితుల ఓట్ల కోసం పనిచేస్తుందే కానీ, దళితులకు అంతర్గత రిజర్వేషన్లు అమలులో విఫలం చెందిందని దళిత పోరాట సమితి నాయకులు జీఆర్ దేవరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం చెళ్లికెరలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన ప్రభుత్వం సర్వేల పేరుతో కాలయాపన చేస్తోందన్నారు. అంతర్గత రిజర్వేషన్లు విషయంలో ఈనెల 31 లోగా ప్రభుత్వం తన విధానాన్ని ప్రకటించకపోతే దళితులంగా ఏకమై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు కేఏఎస్ విశ్రాంతి అధికారి పురుషోత్తం, దయానంద్, చౌడప్ప, బీపీ ప్రేమనాథ్, నాగేంద్రప్ప, విజయ్‌కుమార్, రుద్రముని. బండేరాగస్వామి, వీరభద్రి, నాగరాజు, హెచ్.వి కృష్ణమూర్తి, జయన్న, మారన్న. రామన్న రంగనాథ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుపై ఎలుగుబంటి దాడి

కంప్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి) : ఎలుగుబంటి దాడితో రైతు తీవ్ర గాయాలపాలయ్యారు. సంజీవరాయుని కోట గ్రామంలో మంగళవారం ఉదయం రాజా అనే రైతుపై ఎలుగుబంటి దాడి చేసి తీవ్రగాయాలు చేసింది. ఉదయం రాజా తన మేకలను మేపడానికి అడవుల్లోకి వెళుతుండగా కుమ్మరికుంట వద్ద పొదల్లో ఉన్న ఎలుగుబంటి ఒక్కసారిగా ఆయనపై దాడి చేసింది. తల భాగంలో చెవులు, ముక్కు, కళ్లు, దవడ అవయవాలను తీవ్రంగా గాయపరిచింది. రాజా కేకలు విన్న చుట్టుపక్కల ఉన్న రైతులు రావడంతో ఎలుగుబంటి అడవిలోకి పరుగు తీసింది. గాయపడిన రాజాను ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఎలుగుబంట్లు సంచరించే ప్రదేశాల్లో నామ ఫలకాలను ఏర్పాటు చేయాలని, ఎలుగుబంటిని పట్టుకుని వేరే ప్రాంతానికి తరలించాలని గ్రామస్థులు వాపోయారు. తెల్లవారుజామున రాత్రివేళల్లో కొండ ప్రాంత పొలాల్లోకి వెళ్లే రైతులు ఒంటరిగా వెళ్లకుండా నలుగురు ఐదుగురు రైతులు కలిసి శబ్దాలు చేసుకుంటూ వెళ్లాలని అధికారులు తెలిపారు. రైతుపై దాడి విషయాన్ని పై అధికారులకు తెలియజేస్తామన్నారు.

26న గ్రూప్-బి పరీక్షలు

హోస్పేట, జూలై 22(ఆంధ్రజ్యోతి):వివిధ విభాగాల్లోని గ్రూప్ బీ పోస్టులకు ఈనెల 26న విజయనగరం జిల్లాలోని పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని, పరీక్షలు సజావుగా ప్రశాంతంగా జరిగేలా పరీక్ష కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు విధించినట్లు జిల్లా కలెక్టర్ ఎంఎస్ దివాకర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 26న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4గంటలకు వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. నిషేధిత ప్రాంతంలో జిరాక్స్, కంప్యూటర్, సైబర్ దుకాణాలను మూసివేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రంలో అభ్యర్థులు కాకుండా ఇతర వ్యక్తులు అనుమతించబడరన్నారు. ఆదేశాలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు

బసవరాజ్ రెడ్డి మృతి



బసవరాజ్ రెడ్డి(ఫైల్)

రాయచూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు జీ బసవరాజ్ రెడ్డి(67) సోమవారం రాత్రి మృతి చెందారు. ఆయన భౌతిక కాయానికి మంగళవారం మున్నూరు కాపు సమాజం రుద్రభూమిలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. దాదాపు 25 ఏళ్ల సుదీర్ఘకాలం పాటు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పార్టీకి ఎనలేని సేవలు చేసిన బసవరాజ్ రెడ్డి మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు. జడ్పీ సభ్యుడిగా, నగరసభ సభ్యుడిగా ప్రజాజీవితంలో నిష్కలంక సేవకుడిగా పేరు గాంచిన బసవరాజ్ రెడ్డి అటు కుటుంబంలోను కుటుంబ పెద్దగా కీర్తిని ఆర్జించారు. ఐదుగురు సోదరులతో ఉన్న ఉమ్మడి కుటుంబ పెద్దగా ప్రముఖ వ్యాపారిగా పలు స్వచ్ఛంద సంస్థలకు దాతగా కీర్తిని గడించిన ఆయన మృతి పట్ల మంత్రి భోసరాజు, ఎంపీ జీ కుమార్ నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్ తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

శ్మశానవాటికనూ ఆక్రమించుకున్నారు

● సర్వే చేపట్టి చర్యలు తీసుకోవాలి

● దేశ్ ప్రేమ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షణ్ముఖప్ప



కంప్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని రామసాగర్ గ్రామంలో శ్మశానవాటిక సర్వే నెంబర్ 767 మొత్తం 13.14 ఎకరాలు విస్తీర్ణం వుండగా కేవలం మూడు ఎకరాల భూమిని మాత్రమే ఉపయోగిస్తున్నారని, మిగిలిన 10.14 ఎకరాల భూమి ఆక్రమణకు గురయ్యిందని దేశ్ ప్రేమ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షణ్ముఖప్ప శెట్టార్ ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్మశానవాటికను సర్వే చేపట్టి ఆక్రమిత భూమిని ఖాళీ చేయించాలని రెవెన్యూ శాఖ అధికారులను కోరారు. కబ్జాదారులు శ్మశానవాటికనూ వదలడం లేదన్నారు. శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ నిర్మించి, నీరు పైపులైన్ వ్యవస్థ, నీటి ట్యాంకు వ్యవస్థ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

11నుంచి నిరవధిక సమ్మె

● షెడ్యూల్డు కులాల అంతర్గత రిజర్వేషన్ పోరాట కమిటీ

బళ్లారి సిటీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఆగస్టు 11నుంచి శాసనసభ వర్షాకాల సమావేశాలు ప్రారంభమవుతాయని, అదే రోజు నుంచి అంతర్గత రిజర్వేషన్ల కోసం బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్ వద్ద నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు షెడ్యూల్డ్ కులాల అంతర్గత రిజర్వేషన్ పోరాట కమిటీ తెలిపింది. మంగళవారం హొసపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ రాష్ట్ర కన్వీనర్ కరియప్ప గుడిమణి మాట్లాడుతూ వర్షాకాల సమావేశాల్లోనే అంతర్గత రిజర్వేషన్లను అమలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులు వీధుల్లో పోరాడాల్సిన అవసరం లేదని, విధానసభలోప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే సరిపోతుందన్నారు. షెడ్యూల్డ్‌లోని అంతర్గత రిజర్వేషన్ల కోసం అనేక సంవత్సరాల డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యతా ప్రాతిపదికన అమలు చేయవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి ఆగస్టు 1కి ఒక సంవత్సరం పూర్తవుతోందన్నారు. మరింత ఆలస్యం చేసే వ్యూహాలను ఆశ్రయించకుండా అంతర్గత రిజర్వేషన్లను అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అంతర్గత రిజర్వేన్ల కోసం పోరాడాల్సిన అవసరం లేదని మాజీ మంత్రి ఆంజనేయ చేసిన ప్రకటనను మనం వినే స్థితిలో లేమన్నారు. రాజకీయ కారణాలతోనే తాను అలాంటి ప్రకటన చేశారన్నారు. ప్రభుత్వం పై ముందుగానే ఒత్తిడి తెచ్చిఉంటే మనం నిరసన తెలపాల్సిన అవసరం ఉండేది కాదన్నారు. ఈసందర్భంగా సంచార గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు చిన్నమారెప్ప, డిఎస్ఎస్ జిల్లా సమన్వయకర్త కరిగనూర్ లక్ష్మణ, డిఎస్ఎస్ జిల్లా యూనిట్ అధ్యక్షుడు మల్లికార్జున ,నాయకులు శేఖర్,చిన్నదాసర,రమేశ్, లక్ష్మణ,నాగప్ప తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ సభ్యులు

గుండె ఆసుపత్రి ఏర్పాటు చేయాలి

● రైతు సంఘం నాయకుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

చెళ్లకెర, జూలై 22(ఆంధ్రజ్యోతి): మధ్య కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాలో జయదేవ కార్డియాలజీ అనుబంధ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని రైతు నాయకులు కసవనహళ్లి రమేష్ కోరారు. మంగళవారం చెళ్లకెరలోని సీజీఎస్ ఆసుపత్రి ఆవరణంలో మధుమేహం, గుండెజబ్బుల పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రైతులు, విశ్రాంతి ఉద్యోగులు, తదితర ప్రముఖులు హజరయ్యారు. ఈసందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ బెంగళూరులో ఉండే జయదేవ కార్డియాక్ ఆసుపత్రికి వెళ్లాలంటే ఇక్కడి ప్రజలకు ప్రయాస తప్పడం లేదన్నారు. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేస్తే ఎందరికో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రికి అనుబంధంగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కే.ఎస్. రవీంద్రనాథ్, రైతు నాయకుడు నాగరాజు, అన్వర్ రంగస్వామి, మీసరాబహళ్లిశివన్న, హనుమంతు, డాక్టర్ ముద్దురంగప్ప, డాక్టర్. ఎస్. జయంత్, తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

భక్తిశ్రద్ధలతో తిరువిలక్కు పూజలు



పూజల్లో పాల్గొన్న మహిళలు

హోసూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): సేవాభారతి సంస్థ ఎనిమిదో వార్షిక తిరువిలక్కు పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. నగరంలోని ప్రైవేట్ కల్యాణమండపంలో మంగళవారం కార్యక్రమం జరిగింది. 600మందికిపైగా మహిళలు పాల్గొన్నారు. దుష్టశక్తులు తొలగి, మంచి జరుగుతాయనే విశ్వాసం ఉంది. సేవాభారతి జిల్లా నిర్వాహకురాలు పద్మ విష్ణుకుమార్ నేతృత్వం వహించారు.

ఎమ్మెల్యేతో హేతువాద మండలి భేటీ

హోసూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పరిధిలోని 22వ వార్డు డీఎంకే కౌన్సిలర్, ఆరోగ్యస్థాయి కమిటీ అధ్యక్షుడు మాదేశ్వరన్‌ను డీఎంకే కళలు సాహిత్య, హేతువాద మండలి రాష్ట్ర ఉపకార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌ను మంగళవారం ఆత్మీయంగా భేటీ అయింది. ఎమ్మెల్యేకు గజమాలతో సత్కరించి బుద్ధ విగ్రహాన్ని బహూకరించింది. ఈ సందర్భంగా డీఎంకే సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ప్రకాశ్‌ను సత్కరిస్తున్న మండలి సభ్యులు

కెలవరపల్లి డ్యాంకు పెరిగిన నీటిమట్టం

హోసూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): హోసూరు చుట్టుపక్కల ప్రాంతాలలో వర్షం కురుస్తుండడంతో తెన్‌పెన్నె నదికి అనుబంధమైన కెలవరపల్లి డ్యాంకు నీటిమట్టం పెరిగింది. రెండోరోజు మంగళవారం 789 క్యూసెక్కులు చేరింది. కాగా నీటిలో నురుగు ఎక్కువగా ఉండడం స్థానికులను కలవరపెడుతోంది. డ్యాంకు వస్తున్న నీటిలో సరిహద్దులోని ఫ్యాక్టరీలనుంచి వెలువడే వ్యర్థాలు చేరుతున్నాయని వీటికి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. సోమవారం 20మిమీ వర్షపాతం నమోదు కాగా మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.



డ్యాం నుంచి వస్తున్న నురుగు నీరు

మాచి సమాజ భవనానికి రూ.25 లక్షల మంజూరు

బళ్లారి రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని మంగళవారం మణికంఠ కాలనీలో శ్రీభవాని దేవస్థానం ట్రస్టు కమ్యూనిటీ హాలు నిర్మించడానికి మాచి సమాజం చేస్తున్న సుదీర్ఘ కాలం ప్రయత్నంతో ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి మాచీ సమాజ కళ్యాణ మండపం నిర్మాణానికి రూ. 25 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు నారా భరత్‌రెడ్డిని శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. భరత్‌రెడ్డి మాట్లాడుతూ మొత్తం మీద అన్ని దేవాలయాలకు సమాజంలో ఏ సమాజానికైనా ప్రజలు సమస్యలు నెరవేర్చడంతో పాటు దేవాలయం అభివృద్ధి కూడా చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు నూరు మహమ్మద్, మించు శ్రీనివాస్, కాంగ్రెస్ ప్రముఖులు, ఛానాళ్ శేఖర్, హగరి, గోవిందు, సమాజ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

ఉలిగి ఆలయంలో భక్తుల సందడి

బళ్లారి రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి) : కొప్పాళ జిల్లా పేరు ప్రఖ్యాతిగాంచిన ఉలిగి దేవస్థానం ఆలయంలో మంగళవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ పూజలకు పలు రాష్ట్రాల నుండి భక్తాదులు పెద్దఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయం సమీపంలోని తుంగభద్ర నదిలో భక్తులు పుష్కరస్నానాలు చేస్తూ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలకు ఆంధ్ర, కర్ణాటకతో పాటు కర్ణాటక పలు జిల్లాల నుండి భక్తాదులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



ఆలయం వద్ద వేచి ఉన్న భక్తులు

తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలి

● మరమ్మతులపై అధికారులు నిర్లక్ష్యం చేయరాదు

● ప్రగతి సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే అన్నపూర్ణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నపూర్ణ

బళ్లారి సిటీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): పట్టణానికి ప్రతి ఐదురోజులకు ఓసారి తాగునీరు సరఫరా చేయాలని, రాబోయే రోజుల్లో అన్ని వార్డులను పరిశీలించి ప్రజల సమస్యలను అక్కడే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం అన్నారు. మంగళవారం సండూర్ పట్టణంలోని తాలూకా పంచాయితీలో నిర్వహించిన 2025-26 సంవత్సరం మొదటి త్రైమాసిక ప్రగతి సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. కొన్ని గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీటి యూనిట్లు మూడు సంవత్సరాలుగా పాడైపోయాయని, మాటికి మరమ్మతులు చేపట్టాల న్నారు. అన్ని గ్రామపంచాయతీల పీఈఓలు దెబ్బతిన్న స్వచ్ఛమైన తాగునీటి యూనిట్లను మరమ్మతులపై శ్రద్ధ చూపాలన్నారు. చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, సరస్సుల అభివృద్ధికి ఎన్ఆర్ఈజీఏ నిధులను ఉపయోగించాలన్నారు. తాలూకాలో విద్యుత్తు సమస్యను పరిష్కరించడానికి జెస్కామ్ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జెస్కామ్ అధికారి ఉమేశ్ మాట్లాడుతూ మైనింగ్ ప్రభావిత గ్రామాల్లో వర్షం గాలి కారణంగా చెట్లు వైర్లపై పడతాయన్నారు. సుశీలనగర్ స్కూల్ ప్రిన్సిపాల్ కర్జగి మాట్లాడుతూ పాఠశాల గ్రామానికి దూరంగా ఉన్నందున బస్సు ఏర్పాటు చేయాలని కోరారు. ఈసందర్భంగా తహసీల్దార్ అనిల్‌కుమార్, తాలూకా పంచాయతీ కార్యనిర్వాహణాధికారి బసప్ప పాల్గొన్నారు.

నేటి నుంచి చౌడేశ్వరి ఉత్సవాలు

హిందూపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ముద్దిరెడ్డిపల్లిలో వెలసిన చౌడేశ్వరి మాత అమ్మవారి జయంతి ఉత్సవం రెండ్రోజులపాటు ఘనంగా జరుగనున్నట్లు ఆలయ ధర్మకర్త బండారు బాలాజీ, అధ్యక్షులు డీఏ నాగరాజు తెలిపారు. బుధవారం గోధూళి లగ్న ముహూర్తకాలం స్వస్తివాచనంతో ప్రారంభమై లలిత సహస్ర కుంకుమార్చన జరుగనుంది. బుధవారం అమావాస్య సందర్భంగా చౌడేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కళశార్చన, నవగ్రహ హోమం కార్యక్రమాలు జరపనున్నారు.